- రూ.4కోట్ల బిల్లులు పెండింగ్
- సగం అయినా ఇస్తే మిగతా పనులు చేస్తామంటున్న కాంట్రాక్టర్
- పెద్దమొత్తంలో కూలి డబ్బుల బకాయితో పనులు ఆపేసి వెళ్లిపోయిన సదరు ఏజెన్సీ
- ప్రస్తుతం 2.55 టీఎంసీల నీరు నిల్వ


కూలీలు వెళ్లిపోవడంతో స్పిల్‌వేపై అమర్చకుండా ప్రాజెక్టు వద్ద పడి ఉన్న 14వ గేటు

కీలక అంశాలపై పాలకులు సీరియస్‌గా దృష్టిపెట్టని ఫలితం ప్రస్తుతం గుండ్లకమ్మ ప్రాజెక్టు పనులకు ఆటంకమైంది. మొత్తం 15 గేట్లలో 13 పనులు పూర్తిచేసి మరో రెండింటిని ఏర్పాటు చేయాల్సిన సమయంలో బ్రేక్ పడింది. రూ.కోట్లలో బిల్లులు పెండింగ్ ఉండగా కొంతైనా ఇప్పిస్తే తదుపరి పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టు ఏజెన్సీ పదేపదే అధికారులను కోరింది. చివరకు కీలకమైన మంత్రులను కలిసినా ఫలితం లేకుండా పోయింది. ఎంతకీ నిధులు విడుదల కాకపోవడంతో సదరు కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. అలాగే గేట్లు అమర్చడంతోపాటు పెయింటింగ్, ఇతర పనులు చేసే కూలీలను కర్నూలుకు చెందిన వ్యక్తి సమకూర్చారు. ఆయనకు లక్షల్లో వేతనాలు బకాయిపడటంతో అవి ఇచ్చేంతవరకు తాము పనులు చేయలేమని కూలీలు వెళ్లిపోయారు. దీంతో పూర్తిచేసిన గేట్లు ప్రాజెక్టు వద్ద ఉండిపోయాయి.

గుండ్లకమ్మ పనులకు బ్రేక్

15 గేట్లలో 13 వరకు పూర్తి

మరో రెండు చేస్తే పూర్తిస్థాయిలో నీటి నిల్వకు అవకాశం

ఒంగోలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ముప్పై మంది వరకు కూలీలతో గేట్ల పనులు జరుగుతూ సందడిగా ఉంటున్న గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద వారం రోజులుగా నిర్మానుష్య వాతావరణం నెలకొంది. చేసిన వాటికి బిల్లులు పెండింగ్ ఉండటంతో సదరు కాంట్రాక్టర్ పనులను నిలిపేశారు. పంటలకు సంబంధించి కీలక సమయం కావడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే గత నెలలో కురిసిన వర్షాలతో కొంత ఉపశమనం పొందిన రైతులు సంక్రాంతి తర్వాత నీటి కోసం ఒత్తిడి చేసే అవకాశం ఉంది. దీంతో మిగిలిపోయిన రెండు గేట్ల వద్ద స్టాప్ లాక్ గేట్లను పెట్టి అధికారులు నిల్వ చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో గుండ్లకమ్మ ప్రాజెక్టును గాలికొదిలేసిన విషయం విదితమే. కనీసం గేట్ల నిర్వహణకు అవసరమైన నిధులు కూడా ఇవ్వక అవి దెబ్బతినిపోయాయి. తక్షణం గేట్లకు మరమ్మతులు చేయకపోతే అవి దెబ్బతిని నీటిని నిల్వ చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని 2022 సీజన్‌కు ముందే ప్రాజెక్టు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ప్రధానంగా 15 గేట్లలో 6, 7 నంబర్ గేట్లు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటి మరమ్మతులకు రూ.కోటి ఇవ్వాలని ప్రతిపాదనలు పంపి అవి దెబ్బతినకుండా స్టాప్‌లాక్ గేట్లను అమర్చారు.

రెండేళ్లుగా ఎండగట్టారు..

స్టాప్‌లాక్ గేట్లను పెట్టామన్న ధీమాతో అధికారులు నీటిని నింపే ప్రయత్నం చేయగా ఆ ఏడాది ఆగస్టు 31న వచ్చిన వరద నీటితో 3వ నంబరు గేటు కొట్టుకుపోయింది. ప్రాజెక్టు నీరంతా సముద్రంపాలైంది. రిజర్వాయర్‌లో పెంచుతున్న చేపలు కూడా పోయి వందలాది జాలర్ల కుటుంబాలు నష్టపోయాయి. అనంతరం అధికారులు దెబ్బతిన్న గేట్లను తాత్కాలికంగా కొన్ని స్టాప్‌లాక్ గేటు సెగ్మెంట్లను పెట్టారు. అలా 15 గేట్లలో మూడింటి వద్ద స్టాప్‌లాక్ గేట్లు అప్పటికే పెట్టడంతో నీటిని నిల్వ చేసే ధైర్యం చేయలేక ఆ ఏడాది ఆయకట్టుకు నీరివ్వకుండా ఎండగట్టారు.

అనంతరం కొంతకాలానికి ప్రత్యేకించి నాటి టీడీపీ ఎమ్మెల్యేలు.. రైతు సంఘాల ఆందోళనలు, ఒత్తిళ్లతో గేట్ల మరమ్మతులకు టెండర్లు పిలిచారు. డబ్బు ఇస్తారన్న నమ్మకం లేక పెద్దగా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అతికష్టంపై ఒకరిని అధికారులు తెచ్చి పనులు అప్పగించారు. సకాలంలో బిల్లులు ఇవ్వక ఆ పనులలో

టీడీపీ ఎమ్మెల్యేల ఆందోళనతో కదలిక

జాప్యం జరిగింది. మొత్తం రూ.98 లక్షలతో టెండరు ఖరారు కాగా అతికష్టంపై రూ.60లక్షలు ఇచ్చారు. అదే కాంట్రాక్టర్‌కు మరో రూ.70లక్షలతో కొట్టుకుపోయిన 3వ నంబరు గేటు కూడా చేయాలని సూచించారు. అందుకు సదరు కాంట్రాక్టర్ విముఖత వ్యక్తం చేసి ముందుగా ఒప్పుకున్న

మిగతా 6వ పేజీలో


ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, మేయర్ సుజాత

పోరాట యోధుడు ఓబన్న

- మంత్రి స్వామి
- ఘనంగా 'వడ్డే' జయంతి

6

మళ్లీ ఎయిడెడ్

17 పాఠశాలలపై వేటుకు రంగం సిద్ధం

- డీఈవో షోకాజ్ నోటీసులు
- 15 రోజుల్లో సంజాయిషీకి ఆదేశం


దర్శి మండలంలోని కృష్ణాపురం ఎయిడెడ్ పాఠశాల

ఒంగోలు విద్య, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 17 ఎయిడెడ్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు మూసివేత గండం పొంచి ఉంది. 40మంది లోపు విద్యార్థులు ఉండటంతో ఆ స్కూళ్లకు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్ సంజాయిషీ నోటీసులు జారీచేశారు. యూడైస్ 2024 ప్రకారం ఎయిడెడ్ పాఠశాలల్లో 40మంది లోపు విద్యార్థులు ఉంటే వాటికి నోటీసులు జారీ చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ డీఈవోలను ఆదేశించారు. యూడైస్ ప్రకారం తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల జాబితాలను కూడా డైరెక్టర్ పంపారు. వీటిలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో అక్కడ పనిచేస్తున్న టీచర్లు మిగులుగా తేలుతున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి 30మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. అయితే ఆ పాఠశాలల్లో అదనంగా పనిచేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆయా యాజమాన్యాలకు గతంలో చెప్పినా పట్టించుకోని పరిస్థితి. దీంతో ఈ స్కూళ్లకు అధికారులు నోటీసులు జారీచేశారు. మీ పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపు, ఆర్థిక

మిగతా 6వ పేజీలో


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్

సొంతూళ్లకు వెళ్లేదెలా..?

- పట్టణ వాసుల పల్లెబాట
- బస్సుల కోసం పడిగాపులు
- సంక్రాంతి ప్రభావంతో కిటకిట
- సీట్ల కోసం ఫీట్లు
- వరుస సెలవులతో పెరిగిన రద్దీ

7వ పేజీలో

సంప్రదాయం ముద్దు.. జూదం వద్దు



- కోడి పందేలు, రికార్డింగ్ డాన్స్‌లు వేస్తే కఠిన చర్యలు
- ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరిక

ఒంగోలు క్రైం, జనవరి11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను సంప్రదాయ పద్ధతుల్లో జరుపుకోవాలని, జూదం జోలికి వెళ్లొద్దని ఎస్పీ ఏఆర్.దామోదర్ హితవు పలికారు. పండుగ సందర్భంగా కోడి పందేలు, పేకాట, ఇతర జూదాలు, రికార్డింగ్ డాన్స్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం స్థానిక ఐటీఐ కాలేజీలో జరుగుతున్న ఇస్తిమా ప్రార్థనలను ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నిషేధిత క్రీడలను ఎవరూ ప్రోత్సహించవద్దన్నారు. గ్రామీణ ఆటలతో ఉల్లాసంగా గడపాలన్నారు. కబడ్డీ, షటిల్, వాలీబాల్, క్రికెట్‌లాంటి ఆటల పోటీలను నిర్వహించాలని కోరారు. పేకాట, కోడిపందేలు వంటి జూద క్రీడలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. పండుగ సందర్భంగా రికార్డింగ్ డాన్స్ వేయడం కూడా నిషేధం అని అన్నారు. అలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. నగరంలోని అన్ని లాడ్జీలపై నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే డయల్ 112, 100 నంబరుతో పాటు వాట్సాప్ నంబరు 9121102266కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మూడేళ్లుగా వదిలేశారు..!

- నిరుపయోగంగా ఫెసిలిటీ పోర్టబుల్ కొవిడ్ కేర్ యూనిట్
- రూ.3.5 కోట్లతో ఒంగోలు జీజీహెచ్‌లో అప్పట్లో ఏర్పాటు
- హెచ్‌ఎంపీవీ భయంతో ఇప్పుడు హడావుడిగా బోర్డులు
- వినియోగంలోకి తెస్తే రోగులకు మరింత ప్రయోజనం


ఎఫ్‌పీసీ కేర్ యూనిట్ చుట్టూ మొలిచిన పిచ్చిమొక్కలు

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో పేదలకు వైద్యసేవల పేరుతో కోట్ల రూపాయల నిధులు వృథా చేశారు. అయితే ఆసుపత్రుల్లో మాత్రం కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. గొప్పలకుపోయి ఆస్పత్రులలో అనేక నిర్మాణాలు చేపట్టారు. తర్వాత వాటిని నిరుపయోగంగా వదిలేశారు. ఇందుకు ఎఫ్‌పీసీ కేర్ యూనిట్ ఉదాహరణ. నాడు కొవిడ్ తీవ్రంగా ఉండి ఆసుపత్రిలో పడకలు సరిపోకపోవడంతో అదనంగా ఏర్పాటు చేయాలని భావించారు. అమెరికన్, ఇండియన్ ఫౌండేషన్, యూఎస్‌ఏ మాస్టర్ కార్డ్ సౌజన్యంతో ఒంగోలు జీజీహెచ్‌లో కొవిడ్ సమయంలో రూ. 3.5 కోట్లతో 100 పడకల ఫెసిలిటీ పోర్టబుల్ కొవిడ్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. అందులో అవసరమైన

మిగతా 6వ పేజీలో

ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

- మంత్రి డాక్టర్ స్వామి
- ముగిసిన తబ్లిక్ ఇస్తిమా సభలు
- భారీ సంఖ్యలో హాజరైన జనం

7




తబ్లిక్ ఇస్తిమాలో పాల్గొన్న ముస్లింలు (ఇన్‌సెట్‌లో) హాజరైన మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్, టీడీపీ, జనసేన జిల్లా అధ్యక్షులు బాలాజీ, రియాజ్

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ







ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత





కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మీ (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

19న రెవెన్యూ అసోసియేషన్ జిల్లా ఎన్నికలు

● నోటిఫికేషన్ జారీ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నికలు ఈనెల 19వ తేదీన నిర్వహించేందుకు ఎన్నికల అధికారి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్.సురేష్‌బాబు శనివారం నోటిఫికేషన్ జారీ చేశారు. అదేరోజు నామినేషన్ల స్వీకరణ, పరిశీలన జరుగుతుంది. ఎన్నికలు అవసరమైతే అదే రోజు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే డివిజన్ యూనిట్ల ఎన్నికలను నిర్వహించిన అసోసియేషన్ నాయకులు ఇప్పుడు జిల్లా కమిటీ ఎన్నికలకు ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

నేటి నుంచి కరవదిలో రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు

ఒంగోలు(రూరల్), జనవరి11(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది గ్రామంలో ఈనెల 12నుంచి14వ తేదీ వరకు రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలను అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ముగ్గుల పోటీలు, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. చెడుగుడు పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 7095863125, 8919553088 సెల్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

పోరాట యోధుడు ఓబన్న

● మంత్రి స్వామి

● ఘనంగా జయంతి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పోరాట యోధుడు వడ్డే ఓబన్న పోరాట యోధుడని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి అన్నారు. ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాలతో శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మంత్రి డాక్టర్ స్వామి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, రాష్ట్ర టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, మేయర్ గంగాడ సుజాతలు ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి స్వామి మాట్లాడుతూ 9వేల మంది స్థానికులతో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించడమేకాకుండా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నేతృత్వంలో సాగిన ఉద్యమంలో ఓబన్న కీలక పాత్ర పోషించారన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట మాట్లాడుతూ ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట యోధులను స్మరించుకోవడం సముచితమన్నారు. జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థలో అప్పట్లో కింది స్థాయి ఉద్యోగిగా ఉన్న ఓబన్న దీక్షాదక్షతలు నేటి ఉద్యోగులకు, యువతకు స్ఫూర్తి అని అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి చిన్న ఓబులేషు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వల్లెపు రాఘవులు, కుంచాల వెంకటేశ్వర్లు, తన్నీరు ఆంజనేయులు, శివప్రసాద్ తదితరులు మాట్లాడుతూ ఒంగోలులో ఓబన్నవిగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, బీసీ సంక్షేమ అధికారి అంజల, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ తదితరులు ఉన్నారు.

యువకుడిపై హత్యాయత్నం

ఒంగోలు క్రైం, జనవరి11 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై హత్యాయత్నం జరిగిన సంఘటన శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో యరజర్ల గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే, ఒంగోలు నగర పరిధిలోని యరజర్లకు చెందిన గిద్దలూరు ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పనిచేస్తున్న పోకూరి శ్రీకాంత్, కాకుమాను హరికృష్ణ స్నేహితులు. గతంలో వారిద్దరు కలిసి హైదరాబాద్‌లో ఉన్నారు. ఆ సమయంలో హరికృష్ణ మోటార్‌సైకిల్‌ను శ్రీకాంత్ కుదవబెట్టుకున్నాడు. అదేవిధంగా రెండుసార్లు సెల్‌ఫోన్ లాక్కుని అమ్ముకున్నాడు. హరికృష్ణకు తల్లిదండ్రులు లేరని శ్రీకాంత్ చులకనగా చూసేవాడు. అదేక్రమంలో తన స్నేహితులతో కలిసి మద్యం తాగే సమయంలో హరికృష్ణ తనను దూషిస్తున్నాడని శ్రీకాంత్‌కు తెలిసింది. ఈనేపథ్యంలో శ్రీకాంత్ పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న కత్తితో హరికృష్ణను పొడవగా రెండు చోట్ల తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు ఒంగోలు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15నుంచి కరవదిలో మహిళా బీచ్ కబడ్డీ పోటీలు

ఒంగోలు(రూరల్), జనవరి11(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది గ్రామంలో ఈనెల 15నుంచి 16వ తేదీ వరకు మహిళా బీచ్ కబడ్డీ పోటీలను ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్నట్లు ఎన్‌టీఎస్ క్రీడాపరిషత్ వ్యవస్థాపకుడు, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు శిరిగిరి రంగారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక డాక్టర్ రేపూరి రాధాకృష్ణమూర్తి క్రీడాప్రాంగణంలో ఈ పోటీలు సాయంత్రం 3 గంటల నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాజరవుతారని ఆయన తెలిపారు.

మళ్లీ ఎయి'డెడ్'

(5వ పేజీ తరువాయి)

సాయం (గ్రాంటు) ఎందుకు నిలిపివేయరాదో తెలియజేయాలని ఆ నోటీసుల్లో డీఈవో పేర్కొన్నారు. 15 రోజుల్లోపు సంజాయిషీ ఇవ్వకపోతే తదుపరి చర్యలకు ఉపక్రమిస్తామని ఆ ఉత్తర్వుల్లో డీఈవో పేర్కొన్నారు.

నోటీసులు జారీ చేసిన పాఠశాలలు ఇవే..

జిల్లాలో వివిధ మండలాల్లో పనిచేస్తున్న 17 పాఠశాలలకు డీఈవో నోటీసులు ఇచ్చారు. బేస్తవారపేట అమెరికన్ బాప్ట్ మిషన్ పాఠశాల, దర్శి కృష్ణాపురం ఎయిడెడ్ పాఠశాల, దొనకొండ మండలం బాదాపురం ఎయిడెడ్, హనుమంతునిపాడు ఎస్‌పీఆర్‌ఎంసీ, హెచ్‌ఎంపాడు మండలం వెంకటరెడ్డిపల్లి వీసీపీ, కొమరోలు మండలం గోపానిపల్లి ఏబీఎం పాఠశాలలు, కొమరోలు మండలం ఎస్‌ఆర్‌పల్లి ఎస్‌బీఎస్‌ఆర్‌ఎంఎ ప్రాథమిక పాఠశాలలకు నోటీసులు జారీ చేశారు. మార్కాపురం మండలం బోడపాడు ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల, మార్కాపురం ఒకటో వార్డులోని అజాద్ మెమోరియల్, నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల, పోతవరం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల, ఒంగోలు మండలం కొప్పోలు ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల, కొప్పోలు ఏయూపీఎస్‌పీఆర్ ఎయిడెడ్ స్కూలు, పుల్లలచెరువు మండలం మానేపల్లిలోని ఉమామహేశ్వర ఎయిడెడ్ యూపీ స్కూలు, మద్దిపాడు మండలం పెద్దకొత్తపల్లి ఎయిడెడ్ పాఠశాల, పోతవరం పీవీఎస్ ఎయిడెడ్ పాఠశాల, ఒంగోలు ఎస్‌హెచ్‌ఎస్ కాంపౌండ్‌లోని ఏబీఎం స్కూళ్లకు నోటీసులు జారీ చేశారు. ఈ పాఠశాలలపై తదుపరి చర్యలు చేపట్టాలని ఆయా మండలాల మండల విద్యాధికారులను డీఈవో ఆదేశించారు.

మూడేళ్లుగా వదిలేశారు!

(5వ పేజీ తరువాయి)

ఏసీలు, ఆక్సిజన్, ఇతర సౌకర్యాలు కల్పించారు. 2022 ఫిబ్రవరి 3న దాన్ని ప్రారంభించారు. అప్పట్లో తొలుత 65మంది మాత్రమే వాటిలో వైద్యం పొందగా మూడేళ్లుగా కొవిడ్ కేర్ యూనిట్ తలుపులు తెరుచుకోలేదు. దీంతో నిరుపయోగంగా మారింది.

హెచ్‌ఎంపీవీతో హడావుడిగా..

మూడేళ్లుగా పట్టించుకోకుండా వదిలేసిన జీజీహెచ్ అధికారులు హెచ్‌ఎంపీవీ ప్రభావంతో హడావుడిగా రెండు రూములు తెరిచి ఐసోలేషన్ బోర్డును పెట్టేశారు. కొవిడ్ కేర్ యూనిట్ చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి, అడవిని తలపించడమే కాకుండా పారిశుధ్యం పట్టించుకున్న వారే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు వాటిని వినియోగంలోకి తీసుకొచ్చి స్పెషల్ రూంలుగా కేటాయిస్తే మరింత బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

గుండ్లకమ్మ పనులకు బ్రేక్

(5వ పేజీ తరువాయి)

రెండు గేట్ల పనులు చేసి వెళ్లిపోయారు. ఈలోపు ప్రాజెక్టును సందర్శించిన నిపుణుల కమిటీ ప్రాజెక్టులోని మిగిలిన 12 గేట్లకు కూడా మరమ్మతులు చేయాలని నివేదించింది. అందుకు సంబంధించిన అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపే పనిలో అధికారులు ఉండగా 2023 డిసెంబరులో వరద నీటిలో మరో గేటు కొట్టుకుపోయింది. గతంలో కొట్టుకుపోయిన 3వ నెంబరు గేటు పక్కనే ఉండే 2వ నెంబరు గేటు ఈసారి కొట్టుకొని పోయి నీరంతా సముద్రపాలై రెండో ఏడాది కూడా ఆయకట్టుకు నీరివ్వలేదు.

కూటమి రాకతో ఊపందుకున్న పనులు

రెండేళ్లు నీరివ్వక దాదాపు రూ.500 కోట్ల మేర పంట ఉత్పత్తులను రైతులు నష్టపోయారు. ఈ తరుణంలో ఎన్నికలు సమీపిస్తుండటంతో 2024 ఫిబ్రవరిలో రూ.9.50 కోట్లతో 12గేట్ల పనులకు నాటి వైసీపీ ప్రభుత్వం టెండర్లు పిలిచింది. రాష్ట్రంలో ఎవరూ ముందుకు రాలేదు. అహ్మదాబాద్‌కు చెందిన సంస్థ టెండర్ వేసి ఆర్డర్ పొంది పనులు ప్రారంభించింది. ఈలోపు అసెంబ్లీ ఎన్నికలు జరిగి రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. తొలి సమీక్షలోనే గుండ్లకమ్మ పనులకు నిధులు మంజూరుపై ఉన్నతస్థాయిలో హామీ లభించడంతో సదరు కాంట్రాక్టు ఏజెన్సీ త్వరితగతిన పనులు చేపట్టింది. మొత్తం రూ.9.50కోట్లతో టెండర్ పిలవగా రూ.6.80 కోట్లకు దక్కించుకున్న సంస్థ గేట్లను అహ్మదాబాద్‌లోని తమ వర్క్ షాపులోనే చేసి ట్రాలీలపై ప్రాజెక్టు వద్దకు తెచ్చి ఇక్కడ కూలీలతో ఆ గేట్లకు బోల్టులు, ఫిటింగ్, రంగులు వేయడం, డ్యామ్‌లో అమర్చడం వంటి పనులు చేయించారు. కూలీల కాంట్రాక్టు కర్నూలుకు చెందిన వ్యక్తి చేస్తున్నారు. కాగా ఆగస్టులో సుమారు రూ.2.50 కోట్ల బిల్లులను ప్రభుత్వం సదరు కాంట్రాక్టర్‌కు ఇవ్వడంతోపాటు గతంలో కొట్టుకుపోయిన మూడో నంబర్ గేటును కూడా అప్పగించి ఈ సీజన్‌లో నీరివ్వాలన్న లక్ష్యం నిర్దేశించారు. తదనుగుణంగా అధికారుల పర్యవేక్షణ కూడా సాగగా ఇక సదరు ఏజెన్సీ గేట్ల పనులు త్వరితగతిన చేస్తూ వచ్చింది.

ప్రాజెక్టుపైనే పడి ఉన్న గేటు

డిసెంబరు రెండో పక్షం నాటికి తాము చేయాల్సిన 13 గేట్ల పనుల్లో 11 గేట్లు పనులు కాంట్రాక్టు సంస్థ చేసింది. అంతకు ముందే రెండు అయ్యాయి. అలా మొత్తం 13 పూర్తయ్యాయి. అయితే తొలుత బాగానే నిధులిచ్చిన ప్రభుత్వం తర్వాత బిల్లులు గురించి పట్టించుకోలేదు. దాదాపు రూ.5కోట్ల పనులు చేసి ఉండగా రూ.4కోట్ల బిల్లుల అప్‌లోడ్ చేసి ప్రభుత్వానికి నివేదించి ఉన్నారు. గత నెలలో కాంట్రాక్టు ఏజెన్సీ అధికారులపై ఒత్తిడి తీసుకరావడమే కాక ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడును, ఇటీవల జిల్లా మంత్రి డాక్టర్ స్వామిని కూడా కలిసి కోరినట్లు సమాచారం. అయినా నిధులు విడుదల కాలేదు. అయినప్పటికీ 14వ గేటును సిద్ధం చేసి ప్రాజెక్టు వద్దకు తెచ్చారు. అయితే ఆ గేట్లకు ఇక్కడ అవసరమైన ఇతర పనులు చేసే కూలీలను సమకూర్చే ఏజెన్సీ నిర్వాహకుడికి ఇప్పటికే తమకు రూ.50లక్షల మేర బకాయి ఉంది. అవి ఇవ్వకుండా తదుపరి పనులు చేయలేమని తేల్చిచెప్పి పనులు ఆపేశారు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చేంత వరకు ఆ సొమ్ము ఇవ్వలేమని కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులు చెప్పడంతో ఇక్కడ చేస్తున్న కూలీలందరినీ తీసుకొని ఏజెన్సీ వ్యక్తి వెళ్లిపోయారు. దీంతో ప్రస్తుతం 14వ గేటు అహ్మదాబాద్ నుంచి వచ్చినా ఇక్కడ పనిచేసే కూలీలు లేక ప్రాజెక్టు వద్ద పడేశారు.

3 టీఎంసీలు నిల్వ చేసే అవకాశం

పనులు చివరకు వచ్చిన సమయంలో నిధులు ఇవ్వడంలో జాప్యంతో గుండ్లకమ్మ గేట్ల పనులకు బ్రేక్ పడింది. అయితే ఇప్పటికే 13గేట్లు పూర్తితో తమ వద్ద ఉన్న స్టాప్‌లాక్ గేట్లు మిగిలిన రెండింటి వద్ద అమర్చి అధికారులు నీటిని నిల్వ చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 3.85 టీఎంసీలు కాగా పూర్తికాకుండా 3 టీఎంసీల వరకు నీటిని నిల్వ చేసే ఆలోచన చేస్తున్నారు. ఇప్పటివరకు 2.55 టీఎంసీల నీరు రిజర్వాయర్‌లోకి చేరింది. గత నెలలో కురిసిన వర్షాలతో ఆయకట్టుకు నీరిచ్చే అవసరం రాకపోవడంతో మరో వారంరోజుల్లో 3 టీఎంసీలకు చేరనుంది. సంక్రాంతి తర్వాత రైతుల నుంచి నీటి కోసం డిమాండ్ వచ్చే అవకాశం ఉండగా తర్వాత వాన నీరు ప్రాజెక్టులోకి వచ్చే అవకాశం ఉండదు కనుక ఉన్న నీటిని వదలాల్సి వస్తోంది. తక్షణం పాలకపక్ష పెద్దలు దృష్టిసారించి నిధులు విడుదల చేయించడంతోపాటు మిగిలిన రెండు గేట్ల పనులు కూడా పూర్తిచేయించి రిజర్వాయర్ సామర్థ్యం మేర నీటిని నిల్వ చేసేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ముస్లింల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు

● మంత్రి డాక్టర్ స్వామి ● ముగిసిన తబ్లిక్ ఇస్తిమా సభలు







ఇస్తిమా మూడో రోజు సభలకు భారీగా హాజరై ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు





ముగింపు అనంతరం వారివారి ప్రాంతాలకు వెళ్లిపోతున్న ముస్లింలు



చివరి రోజు సభల్లో ప్రార్థనలు చేస్తున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, మంత్రి డోలా, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు(కల్చరల్), జనవరి 11(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో ముస్లింల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఒంగోలు ఐటీఐ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న నిజాముద్దీన్ తబ్లిక్ ఇస్తిమా మహాసభల ముగింపు రోజైన శనివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముస్లిం మైనార్టీలను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని అన్నారు. గత టీడీపీ హయాంలో ఇమాంలు, మౌజంలకు నెల నెలా వేతనాలను ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా మసీదుల మరమ్మతులకు నిధుల కేటాయింపు, హజ్ యాత్రకు వెళ్లే వారికి ఆర్థిక సాయం, పేదింటి ముస్లిం ఆడబిడ్డలకు దుల్హన్ పథకం ద్వారా వివాహానికి ఆర్థిక సహాయం వంటి ఎన్నో కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోనే చేపట్టారని వివరించారు. అదేవిధంగా రాజకీయ రంగంలో సైతం నారా చంద్రబాబు ముస్లింలకు సముచిత స్థానాన్ని కల్పించారని, శాసనమండలి చైర్మన్‌గా షరీఫ్‌కు అవకాశం ఇచ్చి గౌరవించారన్నారు. సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని, ఈ ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ స్వామి, ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌లను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మతపెద్దలు అల్లాహ్ బోధనలు వినిపించారు. చివరిరోజు సభలకు ఇటు ఉమ్మడి ప్రకాశం అటు ఉమ్మడి నెల్లూరు జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ముస్లింలు తరలివచ్చారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లను నిర్వాహకులు చేశారు.

సభా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వివిధ దుకాణాలలో ముస్లింల సంప్రదాయ వస్త్రాలు, వారి అత్యంత ప్రీతిపాత్రంగా ఉపయోగించే సెంటు, అత్తరు వంటి వస్తువులను ముస్లింలు భారీగా కొనుగోలు చేశారు. కార్యక్రమ ఏర్పాట్లను నిజాముద్దీన్ తబ్లిక్ ఇస్తిమా కమిటీ నిర్వాహకులు షేక్ జిలాని, షేక్ ముక్తియార్, సయ్యద్ హమీద్, షేక్ కపిల్ బాషా, సయ్యద్ జమీల్‌లు పర్యవేక్షించారు.



సభలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

సొంతూర్లకు వెళ్లేదెలా ?

పట్టణ వాసుల పల్లెబాట
బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు
సంక్రాంతి ప్రభావంతో కిటకిట
సీట్ల కోసం ఫీట్లు
వరుస సెలవులతో పెరిగిన మరింత రద్దీ



బస్సుల కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వేచిఉన్న ప్రయాణికులు



ఒంగోలు డిపోలో బస్సుల కోసం వేచిఉన్న ప్రయాణికులు

సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణవాసులు పల్లెబాట పడుతున్నారు. దీంతో రవాణ వ్యవస్థకు తీవ్ర డిమాండ్ ఏర్పడింది. అటు ఆర్టీసీ అదనపు బస్సులు ఏర్పాటు చేసినా, ఇటు రైల్వే శాఖ స్పెషల్ ట్రైన్‌లు వేసినా సీటు దొరికే పరిస్థితి కనిపించడం లేదు. మరో పక్క విద్యా సంస్థలకు పది రోజులు సెలవులు రాగా, రెండవ శనివారం, ఆదివారం సెలవు రాగా, మూడు రోజుల పండుగతో ప్రభుత్వ ఉద్యోగులకు మొత్తంగా ఐదురోజలు వచ్చేశాయి. దీంతో కుటుంబ సమేతంగా పెద్ద పండుగ సంక్రాంతికి సొంతూరు వెళ్లేందుకు ప్రజలకు పాట్లు తప్పలేదు. శనివారం ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో వేల సంఖ్యలో ప్రయాణికులు గంటలతరబడి బస్సుల కోసం పడిగాపులు కాశారు. మరోవైపు గ్రామాలకు రిజర్వేషన్ సౌకర్యం లేకపోవడంతో సొంతూరు చేరేందుకు నానా అగచాట్లు పడ్డారు. కనీసం నిలబడే చోటు లేకపోవడంతో పిల్లలు, వృద్ధులకు అవస్థలు తప్పలేదు. దీంతో వచ్చిన ప్రతి బస్సు ఫుల్ అయిపోగా, సీటు కోసం ఫీట్లు చేయాల్సిన పరిస్థితి కనిపించింది. కిటికీల్లో నుంచి సైతం లోపలికి వెళ్లి బస్సులో సీటు సాధించుకున్నారు. మొత్తంగా సంక్రాంతి ఎఫెక్ట్ ప్రభావంతో పట్టణాల నుంచి పల్లెలకు వెళ్లే వారికి ప్రయాణ కష్టాలు తప్పలేదు.

- ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)



రాకరాక వచ్చిన ఓ బస్సు వద్దకు ప్రయాణికుల పరుగులు



బస్సు వచ్చింది పద.. పద



బస్సులో సీట్ల కోసం తోసుకుంటున్న ప్రయాణికులు

ధన్‌రాజ్ వైద్యానికి ఎమ్మెల్యే ముత్తుముల భరోసా

రూ. 7.50 లక్షలు మంజూరు చేయించిన ఎమ్మెల్యే

గిద్దలూరు టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్ హెల్పర్‌గా పనిచేస్తూ మూడు రోజుల క్రితం విద్యుత్ స్తంభంపై షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డ జీడిపల్లె ధన్‌రాజ్ వైద్యానికి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అండగా నిలిచారు. ధన్‌రాజ్ వైద్యఖర్చుల నిమిత్తం రూ.7.50 లక్షలు ఎల్‌వోసీని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మంజూరు చేయించారు. అంబవరం గ్రామానికి చెందిన ధన్‌రాజ్ ప్రైవేటు విద్యుత్‌లైన్ హెల్పర్‌గా పనిచేస్తూ మూడు రోజులక్రితం స్తంభం ఎక్కి విద్యుదాఘాతానికి గురయ్యాడు. గాయపడ్డ ధన్‌రాజ్‌ను కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. ధన్‌రాజ్ పరిస్థితి గమనించిన వైద్యులు వైద్యానికి రూ.12లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి వైద్యానికి అయ్యే ఖర్చును ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి అందజేస్తానని భరోసా ఇచ్చారు. హామీ ఇచ్చిన 24 గంటల్లోనే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎల్‌వోసీ ద్వారా రూ.7.50 లక్షలు మంజూరు చేయించి ఆ మేరకు లెటర్‌ను హైదరాబాద్‌లో ఉన్న తల్లి రత్నకుమారికి పంపించారు. ధన్‌రాజ్ వైద్యానికి భరోసా ఇచ్చి ఆర్థిక సహాయం చేయించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



ఎల్‌వోసీ అందుకుంటున్న ధన్‌రాజ్ తల్లి రత్నకుమారి

ఘనంగా భాష్యం క్రికెట్ పోటీల ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న మారిటైం బోర్డు చైర్మన్ సత్య

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): భాష్యం పబ్లిక్ స్కూలు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. స్థానిక శర్మాకాలేజీలోని క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీలను మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచేయడం చేసుకుని క్రికెట్ ఆడి అందరినీ ఉత్సాహ పరిచారు. అనంతరం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌లు హాజరై పోటీలను తిలకించారు. క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా శర్మాకాలేజీ మైదానంలో సందడి నెలకొంది.

నేటి నుంచి సంక్రాంతి వేడుకలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం గద్దలగుంట పాలెంలో ఆదివారం నుంచి సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు గద్దలగుంట అభివృద్ధి కమిటీ కార్యవర్గ సభ్యులు తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక గద్దలగుంటలోని కమ్యూనిటీ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం కమిటీ చైర్మన్ డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా గద్దలగుంట అభివృద్ధికి కమిటీ ఎంతో కృషిచేస్తోందని, ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా మూడు రోజులు సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం ఆదివారం ముగ్గలపోటీలు, సోమవారం, మంగళవారం ఉదయం 9.15 నుంచి సాయంత్రం 6 వరకు పరుగుపందెం, స్లోసైక్లింగ్, మ్యూజికల్ చైర్స్ పాటల పోటీలు, షటిల్, డాన్స్ పోటీలు, డ్రాయింగ్, స్కిప్పింగ్, వక్తృత్వ పోటీలు, క్రికెట్, బాల్ అండ్ బక్కెట్, ఉపన్యాస పోటీలు ఉంటాయన్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శి ఆరిగ శ్రీనివాసరావు మాట్లాడుతూ 14వ తేదీ సాయంత్రం నిర్వహించే సభలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తారని, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో కుర్రా ప్రసాద్‌బాబు, ఉమ్మడిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మూడున్నర సవర్ల బంగారం చోరీ

సంతనూతలపాడు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గుమ్మళంపాడులో చోరీ జరిగిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ వి.అజయ్‌బాబు తెలిపిన సమాచారం మేరకు.. గుమ్మళంపాడుకు చెందిన నెప్పలి సుబ్బారావు గత కొంత కాలంగా తన భార్యకు అనారోగ్యంగా ఉండటంతో ఒంగోలులో బంధువుల ఇంట్లో ఉంటూ అపుడపుడు స్వగ్రామం వస్తూ ఉండేవాడు. ఈనెల 7న కూడా సుబ్బారావు ఇంటికి వచ్చి వెళ్లాడు. ఈక్రమంలో శనివారం ఉదయం వచ్చి చూడగా ఇంటి తలుపు పగులగొట్టి బీరువాలోని మూడున్నర సవర్ల బంగారపు చైన్, నల్లపూసలగొలుసు చోరీకి గురైనట్లు గమనించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అజయ్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

● డీఎంహెచ్‌వో


పరికరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

కొండపి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన శనివారం మండలంలోని పెట్లూరు పీహెచ్‌సీని, కొండపిలోని వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించారు. పీహెచ్‌సీ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వ్యాక్సిన్ నిల్వ ఉంచే చోట ఉష్ణోగ్రతలను పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పి.అనూషను పలు అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం అమలు గురించి ఆరా తీశారు. కొండపిలోని వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించి అక్కడ ఉన్న ఏఎన్ఎంతో మాట్లాడారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. తాటాకులపాలెం గ్రామంలో జరుగుతున్న చిన్నపిల్లల టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట డీపీహెచ్ఈవో ఎం.రవిబాబు, హెల్త్ సూపర్‌వైజర్ కె.ఎల్.నరసింహం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల విద్యను పరిరక్షించుకోవాలి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

ఒంగోలు విద్య, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యను పరిరక్షించుకునేందుకు ఉపాధ్యాయులు కంకణబద్ధులు కావాలని ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు షేక్ జిలానీ పిలుపుచ్చారు. ఉపాధ్యాయ ఉద్యమనేత నూతలపాటి పరమేశ్వరరావు సంస్మరణ సభ ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాలలో శనివారం జరిగింది. ఈ ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో జిలాని మాట్లాడుతూ విద్య, వైద్యరంగాల్లో పెరుగుతున్న వ్యాపార ధోరణికి అడ్డుకట్ట వేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల మాట్లాడుతూ పరమేశ్వరరావు వ్యక్తిత్వం, ఏపీటీఎఫ్ అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. అనంతరం పరమేశ్వరరావు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ పత్రికాసంపాదకులు ఎస్.గుర్నాథశర్మ, పూర్వ రాష్ట్ర కార్యదర్శులు ఐ.విజయసారథి, బి.రఘుబాబు, జిల్లా ప్రధానకార్యదర్శి డి.శ్రీనివాసులు, డీవీఎస్.స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాళాల పూజ


స్వామివార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

సంతనూతలపాడు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం సీతారామస్వామి ఆలయంలో ధనుర్మాస వేడుకల్లో శనివారం గంగాళాల పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు పి.అజయ్‌బాబు, నాగసాయిక్రిష్ణశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

కళాకారులకు అండగా ప్రభుత్వం

● సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ తేజస్వి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ తేజస్వి

ఒంగోలు(కల్చరల్), జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం కళాకారులకు అండగా ఉంటుందని రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి పేర్కొన్నారు. శనివారం రాత్రి స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, ఏకపాత్రాభినయ పోటీల బహుమతి ప్రదాన సభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒంగోలు నగరంలో జన్మించిన తనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాంస్కృతికశాఖ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అన్నిరంగాల కళాకారులను ఒకేవేదిక మీదకు తీసుకువచ్చి వారికి కావాల్సిన సహాయాన్ని అందజేయటానికి కృషిచేస్తానని చెప్పారు. అనంతరం ఏకపాత్రాభినయ పోటీల విజేతలకు ఆమె బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తేజస్విని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. పోటీలలో న్యాయనిర్ణేతలుగా సీనియర్ రంగస్థల నటులు రాయపాటి ఆశీర్వాదం, దండోరా దాసు వ్యవహరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బేతంశెట్టి హరిబాబు, ప్రధాన కార్యదర్శి ప్రసాదు, కోశాధికారి ధేనువకొండ సుబ్బయ్య, దిగ్విజయ్, కె.వి.రంగారావు, మాకా ఆంజనేయులు, ఏల్చూరి అనంతలక్ష్మి, జాలాది మోహన్, సీహెచ్.శేషారత్నం, ఎ.నరేంద్ర, రిమ్స్ బాబూరావు, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

గోకులం షెడ్లతో పశువులకు రక్షణ : పీడీ


కరవదిలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న పీడీ జోసఫ్‌కుమార్

ఒంగోలు(రూరల్), జనవరి11(ఆంధ్రజ్యోతి): గోకులంషెడ్లతో ఎండలకు, వానల నుంచి పశువులకు రక్షణ దొరకుతుందని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఒంగోలు మండలం కరవది గ్రామంలో ఏర్పాటు చేసిన గోకులంషెడ్డును ఆయన శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పశుపోషకులు గోకులంషెడ్డులను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం పశువుల దాణాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషుబాబు, ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య, పశువైద్యాధికారి ప్రతిమ, పశువైద్య సహాయ అధికారిలక్ష్మయ్య, పోలవరపు వెంకట్రామయ్య, ఏపీవో దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. అలాగే వలేటివారిపాలెంలో 2, కరవదిలో 4, ఉలిచి 1 గోకులం షెడ్లను ప్రారంభించారు.

హనుమాపురంలో..

నాగులుప్పలపాడు: పాడి రైతులకు ప్రభుత్వం అనేక రాయితీలను కల్పిస్తూ ప్రోత్సాహం అందిస్తుందని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ అన్నారు. హనుమాపురం గ్రామంలో నిర్మించిన గోకులంషెడ్లను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో వై.మహాలక్ష్మి, ఏపీడీ వెంకటస్వామి, ఏడీఏ నాగభూషణం, ఏపీవో రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో భవన నిర్మాణ రంగం కుదేలు

● మంత్రి స్వామి

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో భవన నిర్మాణ రంగం కుదేలైందని రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఆరోపించారు. క్రెడాయి ఆధ్వర్యంలో స్థానిక ఏ1 కన్వెన్షన్ హాలులో మూడు రోజులపాటు ఏర్పాటు చేసిన ప్రాపర్టీ రియాలిటీ షోను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసీపీ విధ్వంకర పాలనతో రాష్ట్రంలో నిర్మాణ రంగం అస్తవ్యస్తంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వంలో భవన నిర్మాణ రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ప్రధాని మోదీ విశాఖపట్నం వచ్చి రూ.2లక్షల కోట్లు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో జరిగే నిరంతర ప్రక్రియకు క్రెడాయ్ కలిసి రావాలని తెలిపారు. అలాగే ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రాపర్టీ రియాలిటీ షోను సందర్శించి నిర్వాహకులను అభినందించారు. ఒంగోలులో ఇలాంటి షో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.కార్యక్రమంలో క్రెడాయ్ ప్రతినిధులు, బిల్డర్లు పాల్గొన్నారు.

13,14,15 తేదీల్లో సంక్రాంతి సంబరాలు

● కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరణ చేస్తున్న టీడీపీ నాయకులు

టంగుటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన టంగుటూరులో ఈనెల 13, 14,15 తేదీల్లో సంక్రాంతి సంబరాలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను నిర్వాహక కమిటీ శనివారం ఆవిష్కరించింది. తొలిరోజైన 13వతేదీ వేకువజామున భోగి మంటలు వేస్తారు. అనంతరం ఎద్దులు, ఆవులు, కోడిపుంజులు, పొట్టేళ్ల ప్రదర్శన ఉంటుంది. అదేరోజు మహిళలకు మెహిందీ (గోరింటాకు) కార్యక్రమం మసీదు సెంటర్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుంది. ఉదయం 10గంటలకు ముగ్గుల పోటీలు, బాలబాలికలకు బెలూన్స్ ఊదడం, దారంలోకి పూసలు ఎక్కించడం కార్యక్రమాలు ఉంటాయి. మధ్యాహ్నం 3గంటల నుంచి బాలబాలికలకు స్లోసైక్లింగ్, మహిళలకు లెమన్ అండ్ స్పూన్ పోటీలు జరుగుతాయి. సాయంత్రం 4 గంటలకు స్థానిక బాలబాలికలచే డాన్స్ బేబీ డాన్స్ (సోలో) ప్రదర్శన ఉంటుంది. సాయంత్రం 7గంటలకు నెల్లూరు వినయ్ డాన్స్ అకాడమీ, ఒంగోలు శివడాన్స్ అకాడమీ వారిచే ప్రదర్శన నిర్వహిస్తారు. ఆతరువాత మిమిక్రీ ఆర్టిస్ట్ శివమణి ప్రదర్శన ఉంటుంది. సంక్రాంతి రోజైన 14వ తేదీ ఉదయం 10గంటలకు బాలబాలికలకు రన్నింగ్ రేస్, సాయంత్రం 3గంటలకు కళ్లకు గంతలు కట్టి కుండ పగుల కొట్టే పోటీలు నిర్వహిస్తారు. సాయంత్రం 4గంటలకు 15 ఏళ్లలోపు బాలబాలికలకు మ్యూజికల్ చైర్స్, సాయంత్రం 5గంటలకు స్పీడు వాకింగ్, సాయంత్రం 5.30 గంటలకు తిండి పోటీలు, సాయంత్రం 6గంటలకు మహిళలకు మాత్రమే తాడులాగుడు పోటీలు నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు విజయవాడ పవన్ క్లాసికల్ డాన్స్ అకాడమీ వారిచే క్లాసికల్ డాన్స్ ప్రదర్శన నిర్వహిస్తారు. చివరి రోజైన 15వతేదీ సాయంత్రం 4గంటలకు మహిళలకు మాత్రమే మ్యూజికల్ చైర్స్ పోటీలు ఉంటాయి. సాయంత్రం 5గంటలకు విద్యుత్ అలంకరణలతో తెప్పోత్సవం జరుగుతుంది. రాత్రి 7గంటలకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 8గంటలకు హైదరాబాద్‌కు చెందిన నాదప్రియ ఆర్కెస్ట్రా వారిచే సినీ పాటకచ్చేరి ఉంటుంది.

జీఎన్‌ఎం పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● అడిషనల్ డీఎంఈ వెంకటేశ్వరరావు


మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జీఎన్ఎం పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని మెడికల్ అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. శనివారం ఒంగోలులోని జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన మెడికల్ కాలేజీలో జరుగుతున్న పరీక్షలను పరిశీలించారు. పరీక్షలలో ఎలాంటి మాస్ కాపీయింగ్ లేకుండా చూడాలన్నారు. అనంతరం జీజీహెచ్‌లోని పలు విభాగాలను పరిశీలించిన అడిషనల్ డీఎంఈ ఓపీ, సెంట్రల్ ల్యాబ్, ఐసీయూల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన జీజీహెచ్, రిమ్స్ అధికారులతో సమావేశమై మాట్లాడుతూ వైద్యపరికరాల కొనుగోలుకు ఎన్టీఆర్ వైద్య సేవ నిధులను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే పేదలకు మెరుగైన వైద్యం అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ బాలాజీనాయక్, డిప్యూటీ సూపరింటెండెండ్ నామినేని కిరణ్‌కుమార్, రిమ్స్ ప్రిన్సిపాల్ ఏడుకొండలు, వైస్‌ప్రిన్సిపాల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీ అసోసియేషన్ నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గ సభ్యులకు సత్కారం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఖజానా, లెక్కల శాఖ ఉద్యోగుల సంఘం (ట్రెజరీ) సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలు సబ్ ట్రెజరీ కార్యాలయంలో శనివారం ఎన్నికల అధికారి బి.శ్రీనివాసరావు కొత్త కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షురాలిగా కె.ఎలీషారాణి, కార్యదర్శిగా పీవీ.నారాయణ, సహాధ్యక్షులుగా జె.వెంకటేశ్వర్లు, కార్యనిర్వహక కార్యదర్శిగా ఎన్.శ్రీనాథ్, కోశాధికారిగా ఎ.ఆంజనేయులు, ఉపాధ్యాయులుగా ఎం.అస్మత్‌బేగ్, పి.ముత్యం, ఎ.శ్రీవాణికుమారి, సంయుక్త కార్యదర్శులుగా మస్తాన్‌వలి, జి.రమణ, డి.అంజలిలను ఎన్నుకున్నారు. నూతక కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అమరావతి కార్యదర్శి ఎస్‌కే.అబ్దుల్‌ఖాదర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌లను కలిసి బొకేలు అందజేసి వారిని సత్కరించారు. జిల్లాలో ట్రెజరీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

ధర్మ జీవనమే ముక్తికి మార్గం

● శ్రీలంక బౌద్ధభిక్షువు బోధిహీన



పేద మహిళకు ఆర్థికసాయం చేస్తున్న బోధిహీన

ఒంగోలు(కల్చరల్), జనవరి 11(ఆంధ్రజ్యోతి): మానవుడు ధర్మమార్గంలో జీవించటం ద్వారానే ముక్తిని సాధించగలడని, ధర్మపథమే సమాజానికి శ్రీరామరక్ష అని శ్రీలంకకు చెందిన బౌద్ధ భిక్షువు బోధిహీన పేర్కొన్నారు. దేశ పర్యటనలో భాగంగా శనివారం ఒంగోలు నగరానికి వచ్చిన ఆయన స్థానిక అన్నవరప్పాడులోని శివం ఫౌండేషన్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం స్థానిక శ్రీకాశీనాయన దేవాలయంలో బోధిహీన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బౌద్ధధర్మం ఎంతో సనాతనమైనదని, దానిని ప్రపంచం నలుమూలల ప్రచారం చేయటం కోసం తాను పర్యటన జరుపుతున్నట్లు తెలిపారు. మానవుడు ధర్మమార్గంలో జీవించటానికి అవసరమైన ఎన్నో సూత్రాలను బౌద్ధధర్మం బోధిస్తుందన్నారు. గొల్లపూడి శ్రీహరి మాట్లాడుతూ ఆధ్యాత్మిక పథంలో పయనిస్తున్న బౌద్ధభిక్షువు తమ ఆశ్రమానికి రావటం ఆనందంగా ఉందన్నారు. నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ శివం ఫౌండేషన్ ద్వారా నిత్యం వందలాదిమందికి అన్నదానం జరుగుతుందని చెప్పారు. అనంతరం నిరుపేద మహిళ పెదకత్తుల కోటేశ్వరమ్మకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికసహాయాన్ని అందజేశారు. బౌద్ధభిక్షువు బోధిహీన్ చేతులమీదుగా అనాధలకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, తన్నీరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు తీగలకు దూరంగా
గాలి పటాలను ఎగురవేయాలి

● ఎస్ఈ వెంకటేశ్వర్లు

ఒంగోలు క్రైం, జనవరి11 (ఆంధ్రజ్యోతి): గాలిపటాలను కరెంటు తీగలకు దూరంగా ఎగుర వేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో కోరారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పిల్లలు గాలిపటాలను ఎగురవేస్తుంటారని, అందువల్ల కరెంటు తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఆడుకోవాలని సూచించారు. గాలిపటాలు కరెంటు తీగల మధ్య చిక్కుకున్నప్పుడు వాటిని తీయకూడదని హితవు పలికారు. తద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. గాలిపటాలను చిన్నారులు, విద్యార్థులు పెద్దల పర్యవేక్షణలో ఎగుర వేయాలని కోరారు. సంక్రాంతి పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఎస్ఈ ఆకాక్షించారు.

21న మండల సర్వసభ్య సమావేశం

టంగుటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 21న మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీడీవో దేవసేనకుమారి ఒక ప్రకటలో తెలిపారు. ఎంపీటీసీలు, జడ్పీటీసీ, సర్పంచులు, మండల అధికారులు సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

సంతనూతలపాడు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలో కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వి.అజయ్‌బాబు శనివారం తెలిపారు. గతంలో కోడిపందేలు, పేకాటలు నిర్వహించిన వారిని స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. అదేవిధంగా కోళ్ల కాళ్లకు వినియోగించే కత్తులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలను తెలిపారు.

నేడు స్వామి వివేకానంద జయంతి వేడుకలు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన సంక్షేమశాఖ, సెట్ప్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు స్వామి వివేకానంద 162వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరం కొత్తపట్నం బస్టాండు వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని సెట్ప్ సీఈవో శ్రీమన్నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో యువత, ప్రజానీకం పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పేస్‌లో ముందస్తు సంక్రాంతి


ముగ్గులను వేస్తున్న విద్యార్థినులు

ఒంగోలు విద్య, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో సంక్రాంతి శోభను ఉట్టిపడేలా సిబ్బంది, విద్యార్థులు భోగి మంటలు వేసి రంగవల్లులను తీర్చిదిద్దారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు ప్రదర్శించిన ర్యాంపు వాక్ ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ తెలుగు ప్రజల పెద్ద పండుగ సంక్రాంతి అన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్‌లు వీరాంజనేయులు, కె.రూపఅక్కేష్, సీవీ.సుబ్బారావు, ఏవో ఎం.రమణబాబు, ఆర్గనైజర్లు వైష్ణవి పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులను దహనం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల బిల్లులను భోగి మంటల్లో దహనం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్యభవన్‌లో శనివారం పూనాటి ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాబు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వినియోగదారులపై భారీగా భారాలు మోపారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో విద్యుత్ భారాలు మోపినప్పుడు నాడు ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ కూటమి తీవ్ర నిరసన వ్యక్తం చేసిందని విమర్శించారు. ఈనెల 13వతేదీన భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేసి ప్రజలు నిరసన వ్యక్తం చేయాలని ఆయన కోరారు. వాడుకున్న విద్యుత్‌కు ఇప్పుడు చార్జీలు చెల్లించడం తగదన్నారు. జిల్లాలో కరువు, అధిక వర్షాలు, కష్టాలతో ఉన్న ప్రజలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోకుండా విద్యుత్ భారం మోపారని ఆరోపించారు. సమావేశంలో సయ్యద్ హనీఫ్, జీవీ.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, సోమయ్య, ఎం.రమేష్ పాల్గొన్నారు.

స్నేహం కోసం..


చిన్నారికి బాండ్‌ను అందజేస్తున్న స్నేహితులు

జరుగుమల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వావిలేటిపాడు గ్రామానికి చెందిన పాలేటి శ్రీహరి ఈనెల 2వ తేదీన గుండెపోటుతో మరణించారు. ఆయన కుటుంబానికి స్నేహితులు ఆర్థికసాయం చేశారు. 1999-2000 సంవత్సరంలో వెలుగొండలోని ఏపీ గురుకుల పాఠశాలలో శ్రీహరితోపాటు టెన్త్ చదువుకున్న వారు ఆయన కుమార్తె జాగృతి పేరున రూ.65,100 సుకన్య సంవృద్ధి యోజన బాండ్‌ను శనివారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీహరి స్నేహితులు నారాయణమూర్తి, బాలసత్యం, ఆంజనేయులు, రాకేష్‌శర్మ, కోటి, రమేష్, బాలకృష్ణ, తిరుపతిస్వామి పాల్గొన్నారు.

ఘనంగా ఓబన్న జయంతి


ఓబన్నకు నివాళులర్పిస్తున్న వడ్డెర నాయకులు

సింగరాయకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని మండలంలోని కలికివాయి పంచాయతీ పరిధి వడ్డెరపాలెంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వడ్డెర నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ రేనాటి వీరుడుగా పేరుగాంచిన ఓబన్న జయంతిని కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వల్లెపు రవి, తన్నీరు సుబ్బారావు, రమణయ్య, కృష్ణ, వెంకటేశ్వర్లు, రాఘవులు పాల్గొన్నారు.

15న రామస్వామి జయంతి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ హేతువాద సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15తేదీన స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో అభ్యుదయ కవి, కవిరాజు త్రిపురనేని రామస్వామి 138వ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు ఎస్‌కే.బేగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో హేతువాదులు, మేధావులు, పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అవీ..ఇవీ

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

పొదిలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకాన్ని ప్రతి విద్యుత్ వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. పొదిలి పట్టణంలో మంజునాథ కల్యాణ మండపంలో శనివారం పొదిలి, కొనకనమిట్ల, దొనకొండ, మర్రిపూడి మండలాల విద్యుత్ శాఖ సిబ్బందితో నిర్వహించిన రివ్యూ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ పథకం ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవడమే కాకుండా మిగులు విద్యుత్‌ను వినియోగదారుడు అమ్ముకునే వీలుందన్నారు. కార్యక్రమంలో దర్శి ఈఈవోపీ.శ్రీనివాసులు, డీఈ హరిబాబు, నాలుగు మండలాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం నమోదు

● అభినందించిన ఎరిక్షన్‌బాబు

పెద్దారవీడు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): టీడీపీకి మండలంలో మొట్ట మొదటిసారిగా శాశ్వత సభ్యత్వం నమోదైంది. మండలంలోని దేవరాజుగట్టు పంచాయతీ శివాపురానికి చెందిన ఆనెకాళ్ల శ్రీనివాసరెడ్డి హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన శనివారం టీడీపీకి రూ.1లక్ష చెల్లించి శాశ్వత సభ్యుడిగా నమోదు చేసుకున్నాడు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధికి, నిరుద్యోగ యవతకు ఉపాధి కల్పనకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దీంతో టీడీపీలో శాశ్వత సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు. శాశ్వత సభ్యత్వం తీసుకున్న ఆనెకాళ్ల శ్రీనివాసుల రెడ్డి ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అభినందించారు.

ఇంజనీరింగ్ కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న కార్మికులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి రూబెన్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్, సెమీ స్కిల్ వేతనాలు చెల్లించాలన్నారు. 25 ఏళ్ల నుంచి కార్మికులు సేవలందిస్తున్నప్పటికీ వేతనాలు పెంచలేదన్నారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, హరి, వెంకటరమణ, కనకయ్య, అల్లూరయ్య పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్‌పై చర్యలు తీసుకోవాలి

గిద్దలూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల నడ్డి విరిచే విధంగా ఇష్టానుసారంగా అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బీవీ.రామాంజనేయులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సంక్రాంతి పండుగను కుటుంబసమేతంగా నిర్వహించుకొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వెళ్లేందుకు వస్తున్న ప్రజల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్‌పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేశారు. వెబ్‌సైట్‌లలో వేలాది రూపాయల చార్జీలు స్క్రీన్‌పై కనిపిస్తున్నాయన్నారు. అధికారులు వారిపై ఉత్తుత్తి ప్రకటనలకే పరిమితమయ్యారని విమర్శించారు.

నష్టపరిహారం చెల్లించాలి

గిద్దలూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గడ్డి మందు పిచికారి చేయడంతో ఉన్న పంట కూడా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన పొలాలను ఆయన పరిశీలించారు. మండలంలోని వెల్లుపల్లి, వెంగలరెడ్డిపల్లి గ్రామాలలో 10 మంది రైతులు సుమారు 50 ఎకరాల మేర పప్పుశనగను సాగు చేశారు. గడ్డి ఎక్కువగా ఉండడంతో నివారణకు వెంగలరెడ్డిపల్లెలోని ఒక ఫర్టిలైజర్ దుకాణం నుంచి గడ్డి మందు తెచ్చుకుని పిచికారి చేశారు. దీంతో శనగ పంట కూడా మొత్తం నల్లగా మాడిపోయిందని ఆయన ఆరోపించారు. రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించే ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు.

రేపు ముగ్గుల పోటీలు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వై.పాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు సారథ్యంలో ఈ నెల 13న స్థానిక స్టేట్‌బ్యాంక్ వీధిలో ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసినట్లు టీడీపీ నాయకులు శనివారం తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళలకు ఈ ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ ముగ్గుల పోటీలు ఉంటాయన్నారు. పోటీలలో పాల్గొనే విజేతలకు మొదటి బహుమతి రూ.10వేలు విలువైన టీవీ, ద్వితీయ బహుమతి రూ.5వేల విలువైన ఎయిర్ కూలర్, తృతీయ బహుమతి రూ.3వేల విలువైన బహుమతులు ఉంటాయన్నారు. అలాగే 10 మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలలో పాల్గొన్న ప్రతి మహిళలకు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 9989130261 సంప్రదించాలని కోరారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి


ప్రమదానికి కారణమైన ట్రాక్టర్

కొనకనమిట్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని వాగుమడుగు గ్రామానికి చెందిన సాదం పెద్దచెన్నయ్య(45) మోటర్ బైక్‌పై గ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో పొగాకులోడుతో వాగుమడుగు గ్రామంలోకి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ట్రక్ డోర్ ఆయన్ను ఢీ కొట్టింది. పొగాకు లోడుకోసం ట్రక్కుడోర్ ఓపెన్ చేసి ఉండడంతో పెద్దచెన్నయ్యను ట్రక్కుడోర్ బలంగా తగలింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. భయానికి గురైన ట్రాక్టర్ డ్రైవర్ కదమ బుజ్జయ్య ట్రాక్టర్‌ను అక్కడే వదిలి పరారయ్యాడు. మృతుడికి భార్య రమణమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే గ్రామాన్ని సందర్శించి ప్రమాదానికి కారణాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదంపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పలువురికి నివాళి

గిద్దలూరు టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందిన పట్టణానికి చెందిన చీతిరాల సురేష్ మృతదేహానికి టీడీపీ నేత కృష్ణకిషోర్‌రెడ్డి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే ఉయ్యాలవాడ పంచాయతీలోని అంకనాంపల్లె గ్రామంలో మరణించిన బోగిన వెంకటేశ్వర్లు మృతదేహానికి నివాళ్లు అర్పించారు. ఆయన వెంట నాయకులు బైలడుగు బాలయ్య, శేఖర్, నారాయణరెడ్డి, పరుచూరి నాగేశ్వరరావు ఉన్నారు.

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం

● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ● మినీ గోకులం షెడ్లు ప్రారంభం ● వై.పాలెంలో ప్రారంభించిన ఎరిక్షన్‌బాబు


మిని గోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పాడిరైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. రాచర్ల మండలం గౌతవరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మినిగోకులాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం రైతులను ఉద్దేశించి అశోక్‌రెడ్డి మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాడిరైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక నిధులు వెచ్చిస్తోందన్నారు. పశు సంవర్ధకశాఖ అధికారులు, ఉపాధిహామీ అధికారులు సమన్వయంతో పనిచేసి మంజూరైన మినీ గోకులాలను త్వరితగతిన ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్‌ఖాశింబీ, సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, టీడీపీ మండలశాఖ అధ్యక్షులు కటికే యోగానంద్, నాయకులు జీవన్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, వ్యవసాయశాఖ ఏడీఏ బాలాజీ నాయక్, ఏపీవో మోషె, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దారవీడు : పశుపోషణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని తోకపల్లిలో రూ.2.30లక్షలతో ప్రభుత్వ సహకారంతో నిర్మించిన మినీగోకులం షెడ్డును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం నిరుద్యోగ యువత ఉపాధికి ఒక వైపు ప్రాధాన్యత ఇస్తూనే గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన ఉత్పాదకను పెంపొందించేందుకు తోడ్పాటు నందిస్తుందన్నారు. కుల, మత, రాజకీయ, వర్గ విబేధాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ, పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జాన్ సుందరం, టీడీపీ మండలాధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరెడ్డి, మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, మాజీ జడ్పీటీసీలు గుమ్మా గంగరాజు, జడ్డా రవి, మాజీ సర్పంచ్ నరాలు శ్రీనివాసులు, సుబ్బరామిరెడ్డి, ఇండ్లా రామకృష్ణారెడ్డి, వెన్నా వెంకటరెడ్డి, దుగ్గెంపూడి కొండారెడ్డి, నక్కా శ్రీను, మూడమంచు కొండగురవయ్య , ఈసీ నాయక్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


తోకపల్లిలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం : పేద రైతుల కోసం ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గోకులం షెడ్‌లు పేద రైతులకు వరమని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని మేడపి గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా 90 శాతం రాయితీతో రూ.2.3 లక్షల నిధులతో నిర్మించిన గోకులం షెడ్డును మండల అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి ఎరిక్షన్‌బాబు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో మరిన్ని గోకులం షెడ్లను రైతులకోసం మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కుమార్, ఈవోపీఆర్‌డీ రామసుబ్బయ్య, ఏపీవో సుజాత, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని మొగుళ్లపల్లి గ్రామంలో నిర్మించిన మిని గోకులం షెడ్డును టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు శనివారం ప్రారంభించారు. గోకులం షెడ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒక్కో షెడ్డు రూ. 2.30లక్షలతో నిర్మాణం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండారు శ్రీనివాసులు, ఏపీవో ఎం.శైలజ, ఐటీడీఏ ఏపీవో కె.నాగేశ్వరరావు, మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, కాశికుంట తాండ సర్పంచ్ ఎంసీ.హెచ్ మంత్రునాయక్, నాయకులు కంచర్ల సత్యనారాయణ గౌడ్, వెంకటరెడ్డి, మహేష్‌నాయుడు, కొత్తమాసు అనంత వెంకట సుబ్రహ్మణ్యం పసుపులేటి వెంకట నారాయణ, మేకల శ్రీను, పాలడుగు వెంకట కోటయ్య ఉపాధి హామీ ఈసీ లక్ష్మనాయక్, టీఏ గౌసియా బేగం సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుడారై పాశురం


చెన్నకేశవస్వామికి గంగాళాలతో పాయసం

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసంలో 27వ రోజును పురస్కరించుకుని వైష్ణవాలయాలో కుడారై విల్లుం పాశురం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన ర్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితులు 108 గంగా ళాల పాయసం చెన్నకేశవస్వామికి నైవేద్యం సమర్పించారు. అనంతరం గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్య క్రమాలు పర్యవేక్షించి భక్తులకు సౌకర్యాలు కల్పించారు. వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు. స్థానిక గుండ్లకమ్మ నదీతీరానా వెలసిన లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి 108 గంగాళాల పాయసం సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చెక్కా మాలకొండ నరసింహారావు కార్యక్రమాలు పర్యవేక్షించారు. శివాజీనగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా కుడారై పాశురం నిర్వహించారు.


గోదాదేవికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు


తనిఖీ చేస్తున్న అధికారులు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ట్రాన్స్‌పోర్టు కార్యాల యాల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు శని వారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జిల్లా ఉన్నతా ధికారుల ఆదేశాల మేర కు ఎక్సైజ్ సీఐ సీహెచ్. శ్రీనివాసులు సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. ఇతర ప్రాంతాల నుంచి ట్రాన్సుపోర్టులలో పార్శిల్ ద్వారా మద్యం, గంజాయి, మాదకద్రవ్యాలు సరఫరాల చేస్తున్నారన్న సమాచారంతో ఆధికారుల ఆదేశాలతో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. నవత, క్రాంతి. ఏపీఎస్ఆర్‌టీసీ తదితర ట్రాన్సుపోర్టు కార్యాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. ట్రాన్సుపోర్టు సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ప్రతిపార్శిల్ క్షుణ్ణంగా పరిశీలించి వారి వివరాలను రికార్డు చేసుకోవాలన్నారు. నిషేధిత వస్తువులు సరఫరా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీలలో ఎటువంటి అనుమానస్పద పార్శిళ్లు లేవని అన్నారు. ఈ తనిఖీలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

గిద్దలూరు టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వాహనాలను మైనర్లకు ఇస్తే కఠిన చ్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ కె.సురేష్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పలు కూడళ్లలో ఆయన వాహనదారులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి చదువుకునే విద్యార్థులు వస్తుంటారన్నారు. ఇదే అదునుగా వాహనాలను తీసుకుని రోడ్డుపై విచ్చలవిడిగా తిరుగుతుంటారన్నారు. అటువంటి వారిని గుర్తిస్తే చర్యలు తప్పవని సీఐ తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలు సీజ్ చేసి యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

గిద్దలూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాచర్ల ఫారంలో అనారోగ్యంతో బాధపడుతూ విశ్రాంతి తీసుకుంటున్న టీడీపీ కార్యకర్త దదూదేకుల ఖాశింను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పరామర్శించారు. శనివారం ఖాశిం ఇంటికి వెళ్ళి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మాజీ ప్రధాని ఎల్‌బీ శాస్త్రికి నివాళ్లు

గిద్దలూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ప్రధానమంత్రి లాల్‌బహదూర్‌శాస్త్రి వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నిర్వహించింది. శాస్త్రి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పగడాల రంగస్వామి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. 'జై కిసాన్ జై జవాన్' నినాదంతో దేశాన్ని వ్యవసాయపరంగా, సైనికపరంగా పటిష్ఠపరచిన శాస్త్రిని నేటితరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం


సాయం అందజేస్తున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు అన్నారు. స్థానిక తోటవారి వీధిలో జరిగిన కార్యక్రమంలో శనివారం పలువురు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇలాంటి మంచి కార్యక్రమంలో తాను పాల్గొన్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఆర్థిక అసమాన తలులేని సమాజమే అందరి లక్ష్యం కావాలన్నారు. దానికోసం పనిచేస్తున్న శ్రీకృష్ణా సేవాసమితిని అభినం దించారు. ఈ సందర్భం గా తల్లి లేదా తండ్రి లేని విద్యార్థులైన గుమ్మ శిరీష, నాలి అశోక్, పల్లెబోయిన నాగమల్లేశ్వరీలకు రూ.5 వేల చొప్పున అందజేశారు. పేదలకు దుప్పట్లను అందించారు. శ్రీకృష్ణ సేవాసమితి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఇరిగేషన్ డీఈ నాగేషు, వెటర్నరీ డాక్టర్ రమేష్, ఎక్సైజ్‌శాఖ అధికారి రాధాకృష్ణ, గొర్రెలమండి అధ్యక్షులు ఐలయ్య, ఎర్రగొండపాలెం మాజీ ఎంపీపీ బాలగురవయ్య, దోర్నాల ఎంపీపీ గుమ్మ పద్మజ ఎల్లేష్, మాజీ సర్పంచ్ నంబుల లక్ష్మయ్య, గుమ్మ నాగార్జున, బొరిగొర్ల రామయ్య, అమరయ్య పాల్గొన్నారు.

విద్యాదాత నారాయణరెడ్డి మృతి


నారాయణరెడ్డి (ఫైల్)

కొమరోలు, జనవరి 11 (ఆంధ్ర జ్యోతి): నాలుగు దశాబ్దాలుగా కొమరోలు మండలంలోని మారుమూల గ్రామాల్లోని విద్యార్థులకు విద్యను అందించిన విద్యావేత్త, బందువుల నారాయణరెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. మండలంలోని గోపానిపల్లికి చెందిన బందువుల నారాయణరెడ్డి 1980-81 విద్యాసంవత్సరంలో కొమరోలు, రామవారిపల్లి, ఓబులాపురం, కొత్తపల్లి, శివాజీనగర్‌లో ఎస్‌బీఎన్ఆర్ఎం పాఠశాలలను ప్రారంభించారు. 1993లో కొమరోలు, కొత్త పల్లి ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలుగా అనుమతి పొందారు, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చి దిద్దారు. వీరి శిష్యులు ప్రస్తుతం కొన్ని వేల మంది ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాల్లో ఉన్నారు. ప్రస్తుతం ఎయిడెడ్ పాఠశాలల రాష్ట్ర కార్యదర్శిగా ఉంటూ ఆయా పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించారు. ఆయనకు భార్య నారాయణమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. అంత్యక్రియలు ఆదివారం నిర్వహించనున్నట్లు తెలిసింది.

డీఆర్‌యూసీసీ సభ్యులుగా వెంకటనారాయణరెడ్డి


నియామకపత్రం అందుకుంటున్న వెంకటనారాయణరెడ్డి

మార్కాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్‌కు సంబంధించి రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా పట్టణానికి చెందిన గాయం వెంకటనారాయణరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే, గుంటూరు డివిజన్ వారు జారీ చేసిన ఉత్తర్వులను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి, వసతుల కల్పన కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. త్వరలో మార్కాపురం రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అంతేకాక ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సంబంధించి డిజిటల్ కోచ్ డిస్ప్లేలను త్వరలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. తనను డీఆర్‌యూసీసీ సభ్యునిగా ఎంపిక చేసేందుకు సహకరించిన ఎంపీ శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన విష్ణు సహస్రనామ పారాయణం


పూజల్లో పాల్గొన్న భక్తులు, హోమం నిర్వహిస్తున్న నిర్వాహకులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక నెహ్రూ బజార్‌లోని షిరిడీ సాయి మందిరంలో విష్ణు సహస్ర నామ పారాయణం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు మాట్లాడుతూ.. డిసెంబర్ 31 నుంచి జనవరి 10 వరకు 350 మంది భక్తులు 11 రోజుల పాటు సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణం చేశారన్నారు. ఈ సందర్భంగా అర్చకులు రామకృష్ణాచార్యులు, రవిశంకర్‌శర్మ ఆధ్వర్యంలో లక్ష్మీ నారాయణ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో మందిర సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యను పరిరక్షించుకోవాలి

ఒంగోలు విద్య, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యను పరిరక్షించుకునేందుకు ఉపాధ్యాయులు కంకణబద్ధులు కావాలని ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు షేక్ జిలానీ పిలుపుచ్చారు. ఉపాధ్యాయ ఉద్యమనేత నూతలపాటి పరమేశ్వరరావు సంస్మరణ సభ ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో జిలాని మాట్లాడుతూ విద్య, వైద్యరంగాల్లో పెరుగుతున్న వ్యాపార ధోరణికి అడ్డుకట్ట వేయాలన్నారు.

వడ్డే ఓబన్నకు ఘన నివాళి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ దేవెండ్ల శ్రీనవాసులు మాట్లాడుతూ..స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న ఉద్యమాలు కొనసాగించారన్నారు. వడ్డె ఓబన్న విగ్రహాన్ని మార్కాపురంలో ఏర్పాటు చేయాలన్నారు. వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు బాలయ్య మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో అంగ్లేయులను గడగడలాడించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యంలో సైన్యాధిపతిగా వడ్డే ఓబన్న వీరోచితంగా పోరాడన్నారు. ఆయన పోరాటాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం అధికారికం గా ఓబన్న జయంతి వేడుకలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు నాయుడు చేసిన నిర్ణయం ఎంతో సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాసరయ్య, వడ్డెర సంఘం నాయకులు ఎస్.శ్రీనివాస్, డి.ఏడుకొండలు, బి.శ్రీను, జి.రాములు, రోశయ్య, పల్లెపు పాపయ్య తదితరులు పాల్గొన్నారు. స్థానిక బీసీ భవన్‌లో వడ్డెఓబన్న జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిన్నిక లక్ష్మీప్రసాద్, బీసీ నాయకులు రంగస్వామి, రాచకొండ శ్రీను, మండ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసులు

గిద్దలూరు టౌన్ : స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న వీరోచిత పోరాటం చిరస్మరనీయమని పలువురు టీడీపీ నాయకులు అన్నారు. శనివారం వడ్డె ఓబన్న జయంతిని నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భావితరాలకు ఓబన్న త్యాగాలు స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, కౌన్సిలర్లు లొక్కు రమేష్, గడ్డం బాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, శేఖర్, మహానంది, తదితరులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

గిద్దలూరు : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని రాచర్ల మండలం గౌతవరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆయన చిత్రపటాకి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. బ్రిటీష్ సామ్రాజ్యంపై మొదటిసారి సవాల్ చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి స్నేహితుడు, సేనాపతి వడ్డె ఓబన్న అని, ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించినట్లు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుల కె.యోగానంద్, టీడీపీ నాయకులు జీవనేశ్వర్‌రెడ్డి తదిదితరులుల పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

దర్శి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడి పందేలు, పేకాటనిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వై.రామారావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. సంక్రాంతి పర్వదినాన్ని సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలన్నారు. ఎవరైనా కోడి పందేలు, పేకాట ఆడినా, పాల్గొన్నా వారి వివరాలను తమకు తెలపాలన్నారు. ఈకార్యక్రమాలు నిర్వహించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పామూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పండుగల సందర్భంగా గ్రామాల్లో పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం.భీమానాయక్ హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ టి.కిశోర్‌బాబుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదన్నారు. సంప్రదాయాల పేరుతో కోడి పందేలు ఆడటం తగదన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

దర్శి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని చలివేంద్ర వద్ద గల కాశీనాయన ఆశ్రమంలోని వృద్ధులకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక మల్లారెడ్డి హాస్పటల్స్ అధినేత మల్లారెడ్డి సమకూర్చిన దుప్పట్లను 70 మంది వృద్ధులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవతా సంస్థ అధ్యక్షుడు డి.వెంకటరెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, రాజశేఖరరెడ్డి, తిరుపతిరెడ్డి, జైహింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓబన్న జయంతి

పామూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ నిరంకుశత్వాన్ని ఎదిరించిన ధీరుడు, తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వడ్డె ఓబన్న జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబన్న సైరా నరసింహారెడ్డి అనుచరుడుగా ఉంటూ అక్రమ పన్ను వసూళ్ల చేస్తున్న బ్రిటీష్ పాలకులపై తిరుగుబాటు చేశారన్నారు. ఓబన్న స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు బత్తుల సత్యనారాయణ, యారవ శ్రీను, బొల్లా నరసింహారావు, షేక్ ఖాజారహంతుల్లా, వై ప్రసాద్‌రెడ్డి, ఎం.హుసేన్‌రావు, బీజేపీ నాయకుడు కేవీ రమణయ్య, జనసేన నాయకుడు దరిశి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లిలో..

పీసీపల్లి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): బ్రిటీషు వాళ్లకు ఎదురొడ్డి పోరాడిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సహచరుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలు మండలంలోని వెంగళాపురంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జనసేన మండల అధ్యక్షుడు బండారు రాజు మాట్లాడుతూ వడ్డె ఓబన్న వీరత్వం మరువలేనిదని అన్నారు.

వడియరాజులందరూ ఓబన్నను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామంలోని యువకులు, వడియరాజు సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

పామూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొట్లగూడూరు, వగ్గంపల్లి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా సంక్రాంతి ముగ్గులు, గొబ్బెమ్మలు, భోగి మంటలు వేశారు. పిల్లలు సంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు. వారిపై భోగి పండ్లు వేసి ఆశీర్వదించారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ, ఎంపీఎస్ పార్వతి, కార్యకర్తలు బాగ్యలక్ష్మి, గీత, ఐ.రామంజమ్మ, ఎల్.శ్రీదేవి, సువార్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి

సీఎస్‌పురం(పామూరు), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో యువత రాణించాలని టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా సీఎస్‌పురం మండల కేంద్రంలో ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లా స్థాయిలో శనివారం కేఎస్ రాయల్ అండ్ ఎస్వీ ప్రసాద్ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను సర్పంచ్ శ్రీరామ్ పద్మావతితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములకు అతీతంగా క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాములపాటి నరసయ్య, బొబ్బూరి రమేష్, తోట చిన్న, మన్నేపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగంగవరంలో సంక్రాంతి సంబరాలు

తాళ్లూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుగంగవరం గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 14, 15 తేదీల్లో ఆటల పోటీలు ఏర్పాటుచేసినట్టు నిర్వాహకులు తెలిపారు. 14 వతేదీ ముగ్గుల పోటీలు, 15న స్లోసైక్లింగ్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

తాళ్లూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని శివరాంపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన గోకులం షెడ్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రైతాంగానికి సహకారం అందించేందుకు 90శాతం సబ్సిడీపై గోకులం షెడ్‌లను మంజూరు చేశారన్నారు. ఈ పథకం ద్వారా మేలు జరుగుతుందన్నారు. ఎంపీడీవో కె.సుందరరామయ్య మాట్లాడుతూ మండలంలో 29 గోకులం షెడ్లు మంజూరుకాగా, నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, గొల్లపూడి వేణుబాబు, ఏపీవో మురళి, పశువైద్యాధికారి ప్రతాప్‌రెడ్డి, జనసేన నేత హనుమంతరావు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



తాళ్లూరు: శివరాంపురంలో గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

పాడి పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం చేయూత

కనిగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చేయూతనిస్తుందని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. శనివారం మండలంలోని గురువాజీపేటలో గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గోకులం షెడ్లను నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఒ క్కో గోకులం షెడ్‌కు ప్రభుత్వం రూ.2లక్షల 30వేలు రుణం మంజూరు చేస్తుందన్నారు. ఇందులో 90శాతం సబ్సిడీ ఉంటుందని చెప్పారు. కనిగిరి మండలంలోని 25 గ్రామపంచాయతీల్లో వీటి నిర్మాణానికి సబ్సిడీపై ప్రభుత్వం రుణాలు అందజేస్తుందన్నారు. టీడీపీ నాయకుడు ముచ్చుమూరి చెంచిరెడ్డి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి బాలకృష్ణ నంబుల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



కనిగిరి: గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీవో హనుమంతరావు

పాడి రైతుల సంక్షేమమే లక్ష్యం

పామూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని బోడవాడ గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన గోకులం షెడ్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీవో బి.మాల్యాద్రి, టీడీపీ, నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, యారవ శ్రీను, బొల్లా నరసింహారావు, షేక్ ఖాజారహంతుల్లా, సర్పంచ్ దాసరి మాలకొండయ్య, టీడీపీ గ్రామ అధ్యక్షుడు దొడ్డా కోటిలింగం, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మంచిరోజులు

దొనకొండ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని భూమనపల్లిలో గోకులం షెడ్లను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వంతో రైతులు మంచిరోజులు వచ్చాయన్నారు. గత వైసీపీ పాలనలో గోకులం షెడ్లను పూర్తిగా విస్మరించారన్నారు. గ్రామాల్లో పశుపోషణ, ఆవులు, గేదెల పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ, పెంపకందారులను ప్రోత్సహించేందుకు టీడీపీ ప్రభుత్వం గోకులం షెడ్లు మంజూరుచేసి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసిందన్నారు. కార్యక్రమంలో ఏపీవో దేవయ్య, టీడీపీ నాయకులు విప్పర్ల లక్ష్మీరావు, షేక్ తోహీద్, పోతిపోగు చెన్నయ్య, తోటా వెంకటేశ్వర్లు, యరగొర్ల బసవయ్య, మన్నెం గాలయ్య, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే లక్ష్యంగా..

వెలిగండ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పల్లె అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ మండల నాయకులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని రామలింగాపురం, గన్నవరం, గండ్లోపల్లి, గ్రామాల్లో గోకులం షెడ్లను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయానికి అనుబంధంగా రైతులు పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారని అన్నారు. వారికి అండగా ఉండేందుకు ప్రభుత్వం గోకులం షెడ్లను నిర్మిస్తుందన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, ముత్తిరెడ్డి, కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, గొనా ప్రతాప్, మీనిగ కాశయ్య, సర్పంచ్ బొబ్బా రమణారెడ్డి, ఎంపీడీవో మహబూబ్ బాషా, ఏపీవో నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమకు ప్రోత్సాహం

ముండ్లమూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని శంకరాపురం, ముండ్లమూరు, పెదఉల్లగల్లు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన గోకులం షెడ్లను ఆయన అధికారులతో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉపాధి పథకం ద్వారా గోకులం షెడ్లను నిర్మిస్తున్నదని చెప్పారు.

కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.జనార్దన్, ఏపీవో కె.నాగరాజు, పశువైద్యాధికారి ఎం.విజయలక్ష్మి, సర్పంచ్‌లు కూరపాటి నారాయణస్వామి, మహేశ్వరి, మాజీ సర్పంచ్‌లు జిల్లెమూడి చౌదరి, పూర్ణచంద్రరరావు, తదితరులు పాల్గొన్నారు.

రంగనాయకస్వామికి ప్రత్యేక పూజలు

కనిగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా స్థానిక సాయిబాబా మందిరంలో శనివారం గోదా స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గోదా రంగనాథ స్వామికి వేకువ జామునుంచే తిరుప్పావై పాశురములను పఠించారు. అష్టోత్తర శతనామ పూజా కార్యక్రమాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. సాయిసేవా బృందం మహిళలు స్వామి వారికి పొంగళ్ళు నైవేద్యాలు సమర్పించి అర్చనలు చేశారు. మహిళలు ఆలపించిన సామూహిక కీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ధనుర్మాసంలో వచ్చే శనిత్రయోదశి ఎంతో ప్రాముఖ్యత కావటంతో భక్తులు మందిరంలోని నవగ్రహాలను ఆరాధించి తైలాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష కార్యదర్శులు దేవకి సుబ్రమణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మారావు, వీసీ రామశాస్త్రి, వెంకటేశ్వర్లు, ఏసీ చెంచులు, తదితరులు పాల్గొన్నారు.



గోదా రంగనాయకస్వామికి పూజలు చేస్తున్న మహిళలు

క్రీడలతో మానసిక ఉల్లాసం

» సీఐ ఖాజావలి

కనిగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని సీఐ ఖాజావలి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగుపడతాయన్నారు. సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు, జూదం, ఇతర పందాలను ఆడటం చట్టవిరుద్ధమన్నారు. సంక్రాంతి పండుగను అందరూ సంతోషంగా జరుపు కోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులతో కలసి సీఐ కబడ్డీ ఆడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యుడు వై.రవీంద్రబాబు, ఎంఈవో సంజీవి, యాసిన్, జీపీ రామారావు, మోహన్, పవన్‌కల్యాణ్, సుబ్బారావు, సురేష్ ఇఫ్రాజ్, తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ ఖాజావలి

అలాగే, మండలపరిధిలోని చాకిరాలలో గ్రామ యువజన సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. శనివారం ఈ పోటీలను ఎంపీపీ దంతులూరి ప్రకాశం, రంగనాయకులరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో యువత ఇలాంటి క్రీడలను నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చాకిరాల యువజన సంఘం నాయకులు విశాల్, ఎబినేజర్, నయూమ్, అవినాష్, గ్రామస్థులు అరవింద్‌లూకా, కరుణాకర్, వెంకటయ్య, లక్ష్మీనారాయణ, దావీదు, బాలకృష్ణారెడ్డి, మోరా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముదురుతున్న రేషన్ షాపు వివాదం

» డీలర్ ఆరోపణలను ఖండించిన టీడీపీ నాయకులు

కురిచేడు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కురిచేడులో పదో నంబరు రేషన్ షాపు వివాదం రోజుకో మలుపు తిరుగుతున్నది. ఈవిషయమై శనివారం కురిచేడు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రధాన కూడలిలో వివరాలు వెల్లడించారు. ఈ రేషన్ దుకాణాన్ని 12 సంవత్సరాల నుంచి సయ్యద్ ఫజులూన్ అనే యువతి నడుపుతున్నది. రెండు రోజుల క్రితం ఆ దుకాణంలో బియ్యం అధికంగా ఉన్నాయని రెవెన్యూ విజిలెన్స్ అధికారులు 6ఎ కేసు నమోదు చేశారు. ఈ కేసు పెట్టడం వెనుక టీడీపీ మండల నాయకులు ఉన్నారంటూ ఫజులూన్ శుక్రవారం వైసీపీ నాయకులతో కలసి ఆరోపించారు.

ఈవిషయమై శనివారం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రధాన కూడలిలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ఖండించారు. తమను వివాదాల్లోకి లాగితే ఊరుకోబోమని పేర్కొన్నారు. గతంలో శిద్దా రాఘవరావు మంత్రిగా ఉన్నపుడు తాము తల్చుకుంటే ఫజులూన్ రేషన్ దుకాణం తీసివేయించి ఉండేవారమని పేర్కొన్నారు. అపుడే తాము ఏమీ చేయలేదని, ఇపుడు తమకేం పని అన్నారు. ఈసందర్భంగా ఫజులూన్ తమ్ముడు చేసిన అక్రమాలను వెల్లడించారు. రేషన్ దుకాణం పేరు చెప్పి కోట్ల రూపాయలు సంపాదించడం, రేషన్ కమీషన్ తీసుకుంటూ పించన్ పొందడం ఏంటని వారు ప్రశ్నించారు. ఇకపై తమ పార్టీ వారిని ఏమన్నా ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు.



వివరాలు వెల్లడిస్తున్న టీడీపీ నాయకులు

కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు మొఘల్ మస్తాన్ వలి, కొలిసెట్టి విశ్వనాథం, షేక్ సునీల్, మస్తాన్, శ్రీనివాసరావు, గంధం గురునాథం, మేరువ పెద్దిరెడ్డి, కమతం నాగిరెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్బారావు, మక్కెన రోశయ్య, మర్రి సుబ్బారావు, దాసరి రవి, కాళ్ళ వెంకటేష్, ఉన్నగిరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కల్తీపాలు విక్రయించే నిర్వాహకులపై కఠిన చర్యలు

» డీఎస్పీ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు, దర్శి, తాళ్ళూరు మండలాల పరిధిలో కల్తీ పాలు విక్రయించే నిర్వాహకులతో పాటు తయారుచేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ డి.లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో పాల కేంద్రం నిర్వాహకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్తీ పాలు తయారుచేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడేవారిపై తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల్లో కొందరు కల్తీ పాలు తయారుచేసి ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారన్నారు. దర్శి సర్కిల్ పరిధిలో ఏ గ్రామంలోనైనా కల్తీ పాలు తయారు చేస్తుంటే సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేసినట్టు డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని చంద్రగిరి వద్ద ఓ దుకాణంలో 350 లీటర్ల ఆయిల్ క్యాన్‌లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. సీజ్ చేసిన తొమ్మిది క్యాన్‌ల ఆయిల్‌ను ల్యాబ్‌కు పంపించామన్నారు. నివేదిక వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. పది బృందాలుగా ఏర్పడి అన్ని గ్రామాల్లో పాల కేంద్రాలను తనిఖీ చేసినట్టు చెప్పారు. గేదెల తక్కువ ఉండి ఎక్కువగా పాలను కేంద్రాలకు పోస్తున్న వారిపై కూడా దృష్టి పెట్టామన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ, పక్కన సీఐ, ఎస్ఐలు

దర్శి ప్రాంతంలో ఉన్న డెయిరీలను తనిఖీ చేసినట్టు డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు. నిర్వాహకులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. డెయిరీ నిర్వాహకులు కూడా కల్తీ పాలు విక్రయించే మినీ పాల కేంద్రాలపై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో సీఐ వై.రామారావు, ముండ్లమూరు, తాళ్ళూరు, కురిచేడు ఎస్ఐలు వై.నాగరాజు, ఎస్.మల్లికార్జునరావు, శివ, ఏఎస్ఐలు పి.హనుమంతరావు, వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



నాగుల్ మీరా దర్గా వద్ద పూజలు చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్

వైభవంగా నాగుల్‌మీరా గంధ మహోత్సవం

కురిచేడు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని నాగుల్‌మీరా గంధ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. కురిచేడు ప్రధాన కూడలిలోని నాగుల్ మీరా దర్గా వద్ద ఉదయం నుంచి పూజలు చేశారు. రాత్రి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్‌లు మండల పార్టీ నాయకులతో కలసి దర్గాను సందర్శించి పూజలు చేశారు. దర్గా నిర్వాహకులు గంధం అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

దర్శిలో రేపు ముగ్గుల పోటీలు

దర్శి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 13న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రథమ బహుమతి ఫ్రిజ్, ద్వితీయ, తృతీయ బహుమతులు ఎల్ఈడీ టీవీలు, నాలుగు, ఐదవ బహుమతులు గ్రైండర్‌లు అందజేస్తారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేస్తారు. అలాగే, మహిళలకు తాడులాగే పోటీలు, లెమన్‌స్పూన్ పోటీలు నిర్వహిస్తారు. తాడులాగే పోటీల్లో గెలుపొందిన మహిళలకు ప్రథమ బహుమతి గ్రైండర్, ద్వితీయ బహుమతి రైస్ కుక్కర్ అందజేస్తారు. లెమన్‌స్పూన్ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రైస్ కుక్కర్, ద్వితీయ బహుమతి ఇడ్లీ కుక్కర్ అందజేస్తారు. ఈ పోటీల్లో అధికసంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో మెలగాలి



అంథోనిదాస్‌ను సన్మానిస్తున్న సంఘస్తులు

దొనకొండ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కథోలిక క్రైస్తవులు ఏసుక్రీస్తు సన్నిదిలో భక్తిశ్రద్ధలతో మెలగాలని నెల్లూరు కథోలిక మేత్రాసనం సహ పీఠాధిపతి డాక్టర్ పిల్లి అంథోనిదాస్ సూచించారు. దొనకొండలో 25 సంవత్సరాలు కథోలిక గురువుగా సేవలందిస్తూ ఇటీవల పోప్ ఫ్రాన్సిస్ ఆదేశాల మేరకు నెల్లూరు కథోలిక మేత్రాసనం సహ పీఠాధిపతిగా నియమితులయ్యారు. ఈక్రమంలో మొదటిసారి దొనకొండ విచ్చేసిన ఆయనకు శనివారం ఘనస్వాగతం పలికారు. ఎన్టీఆర్ విగ్రహం సెంటర్ నుంచి చర్చి వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా అంథోనిదాస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సంఘకాపరి రెవరండ్ ఫాదర్ గుడిపల్లి థామస్, సంఘస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

కనిగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతంలో వివిధ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. మండలంలోని బల్లిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ పార్వతమ్మ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. మహిళలు వేసిన ముగ్గులు, భోగిమంటలను గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. చిన్నారులు, మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలతో అలరించారు. భోగి మంటలు వేసి చిన్నారులపై భోగిపండ్లు వేసి ఆశీర్వదించారు. అలాగే, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ జె.ఉషారాణి, కోఆర్డినేటర్ జయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని తొలగించిన అధికారులు

కనిగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నడిరోడ్డులో వేసిన విద్యుత్ స్తంభాన్ని ఆశాఖ అధికారులు తొలగించారు. నాలుగు రోజుల క్రితం పట్టణంలోని సాయిబాబాగుడి వీధిలోని నాలుగురోడ్ల కూడలి వద్ద విద్యుత్‌శాఖలో ఓ కాంట్రాక్టు ఉద్యోగి ఇంటి నిర్మాణం చేపట్టాడు. నిర్మాణానికి అడ్డుగా ఉందని విద్యుత్‌పోల్‌ను నడిరోడ్డులోకి మార్చారు. ఇది ప్రజలకు ఇబ్బందిగా మారింది. ప్రజల ఇబ్బందులపై ఆంధ్రజ్యోతిలో వరుసగా ప్రచురితమైన కథనాలపై అధికారులు స్పందించారు. నడిరోడ్డులో వేసిన విద్యుత్ స్తంభాన్ని శనివారం అధికారులు తొలగించారు. దీంతో ప్రజల ఇబ్బందులు తొలగిపోయాయి.



ఎక్స్‌కవేటర్‌తో విద్యుత్ స్తంభం తొలగింపు

మత్తు పదార్థాల తయారీదారులపై ప్రత్యేక దృష్టి

ముండ్లమూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం సమీపంలోని చెరువుల వద్ద ఒక రేకుల షెడ్డులో ఆల్ఫాజోలం మత్తు పదార్థం తయారుచేసే స్థావరంపై శుక్రవారం సాయంత్రం తెలంగాణ ఎక్సైజ్ పోలీసులు దాడిచేసి నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. ఈక్రమంలో శనివారం దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆప్రాంతాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మత్తు పదార్థాలు తయారుచేసే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇతన ప్రాంతాల నుంచి వచ్చి ఉమామహేశ్వర అగ్రహారంలో చెరువుల వద్ద నివాసం ఉంటూ ఈచర్యలకు పాల్పడుతున్నారన్నారు. కోళ్ళ దానాతో పాటు, కల్లు, సారా లాంటి వాటిలో కలిపే మత్తు పౌడర్‌ను తయారుచేసి వివిధ ప్రాంతాల్లో విక్రయించటం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వ్యక్తులకు ఆశ్రమం కల్పించవద్దన్నారు. వారికి ఆశ్రమం కల్పిస్తే నిర్వాహకులపై తీవ్రచర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ వై.రామారావు, ఏఎస్ఐ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాళాల పూజ

కురిచేడు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కురిచేడు కోదండరామాలయంలో శనివారం గంగాళాల పూజ ఘనంగా నిర్వహించారు. కోదండరామునికి 108 గంగాళాలతో సాగర్ కాలువ నుంచి క్రిష్ణా నది నీటిని తీసుకువచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు శిష్ఠి శ్రావణ్ కుమార్ శర్మ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

డెయిరీలను తనిఖీ చేసిన ఎస్ఐ

తాళ్లూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని పాలసేకరణ కేంద్రాలను ఎస్సై మల్లికార్జునరావు శనివారం తనిఖీ చేశారు. ఈ కేంద్రాల్లో కల్తీ చేస్తున్నారన్న ఆరోపణలతో ఎస్సై సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. పాలసేకరణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. డెయిరీలలో పలువిభాగాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్సై మోహన్‌రావు పాల్గొన్నారు.



పాల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై మల్లికార్జునరావు





నరసరావుపేట మండలం పాలపాడు ప్రాంతంలో సాగు చేసిన పొగాకు

పొగాకు.. 314 శాతం

- రబీలో రికార్డు స్థాయిలో సాగు
- శనగ, మొక్కజొన్నకు ప్రత్యామ్నాయం..
- అనుమతులు పొందని కొందరు రైతులు

పొగాకు.. రబీలో రికార్డు స్థాయిలో సాగైంది. శనగ, మొక్కజొన్న పంటలకు ప్రత్యామ్నాయంగా రైతులు అత్యధికంగా సాగు చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అత్యధికంగా రైతులు పొగాకు సాగు వైపు మొగ్గారు. కొందరు రైతులైతే ఈసారి పొగాకు బోర్డు అనుమతి లేకుండానే సాగు చేశారు. అయినా ఈ సారి సాగు ఆశాజనకంగా ఉంది. దిగుబడులు కూడా బాగుంటాయని రైతులు ఆశిస్తున్నారు. విస్తృతంగా పొగాకు సాగు కావడంతో విక్రయాలకు పొగాకు బోర్డు అనుమతులు ఇవ్వాల్సి ఉంది. ఇందుకు వ్యవసాయ శాఖ సహకరించాలి. మొక్కజొన్న, శనగ సాగు సగానికి సగం తగ్గినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించిన నేపథ్యంలో పొగాకు సాగు గణనీయంగా పెరిగింది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రబీలో పంటల సాగులో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. మూడు జిల్లాల పరిధిలో రబీలో శనగ, మొక్కజొన్న పంటల సాగు గణనీయంగా తగ్గింది. ప్రత్యామ్నాయ పంటలపై అత్యధికంగా రైతులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో పొగాకు సాగు ఊహించని రీతిలో పెరిగింది. దీంతో రికార్డు స్థాయిలో పొగాకు సాగు చేశారు. సాగు విస్తీర్ణం 314 శాతంగా నమోదైంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 81,718 ఎకరాల్లో పొగాకు సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. గత ఏడాది కన్నా సాగు రెట్టింపు చేశారు. వ్యవసాయ శాఖ అంచనా మేరకు పొగాకు సాధారణ విస్తీర్ణం 25,978 ఎకరాలు కాగా 81,718 ఎకరాల్లో సాగు చేశారు. పొగాకు దిగుబడులు రైతుల చేతికి వస్తున్నాయి. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. బోర్డు నుంచి ముందస్తు అనుమతులు పొంది పొగాకు సాగు చేయాలి. అయితే కొందరు రైతులు పొగాకు బోర్డు నుంచి అనుమతులు పొందకుండానే సాగు చేపట్టినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో బోర్డు నిర్ణయంపైనే పొగాకు విక్రయాలు ఆధారపడి ఉన్నాయి. సాగు చేపట్టిన అందరికీ పొగాకు విక్రయాలకు అనుమతులు మంజూరు చేయించేందుకు వ్యవసాయ శాఖ వెనువెంటనే చర్యలు చేపట్టకుంటే రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. తాము సాగు చేసిన పొగాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విక్రయించుకునేలా వ్యవసాయ శాఖ స్పందించాలని రైతులు కోరుతున్నారు.

సగం తగ్గిన శనగ, మొక్కజొన్న సాగు..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రబీలో మొక్కజొన్న, శనగ సాగు గణనీయంగా తగ్గింది. సాధారణ విస్తీర్ణం కన్నా శనగ 40 శాతం సాగు తగ్గిందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మూడు జిల్లాల్లో సాధారణ విస్తీర్ణం 1,24,295 ఎకరాలు కాగా 66,675 ఎకరాల్లో శనగ సాగు చేశారు. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 1,46,462 ఎకరాలు కాగా 85,095 ఎకరాల్లో మాత్రమే సాగైంది.

పొగాకు సాగు ఇలా(ఎకరాల్లో)..

జిల్లా	సాధారణ విస్తీర్ణం	సాగు	శాతం
పల్నాడు	6348	15,803	248.94
బాపట్ల	17,320	57,490	331.92
గుంటూరు	2,310	8,423	364.63



కొనుగోళ్లలో.. కుంభకోణం

- పేదల పేరిట దోపిడీపై కూటమి ప్రభుత్వం దృష్టి
- విజిలెన్స్ విచారణపై అక్రమార్కుల గుండెల్లో వణుకు
- పక్కాగా విచారిస్తే భారీ స్కాం వెలుగులోకి వచ్చే అవకాశం
- నాడు వైసీపీ ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే భూముల కొనుగోళ్లు
- సర్వే నెంబర్ల లీక్‌తో భూములను కొని ప్రభుత్వానికి అధిక ధరకు విక్రయం

నవరత్నాల పేరుతో అధికారం చేపట్టి.. పేదలందరికీ స్థలాలు, ఇళ్లు అని భారీ భూ కుంభకోణానికి నాటి వైసీపీ పాలకులు పాల్పడ్డారు. పేదల ఇళ్ల కోసం అంటూ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వ్యాప్తంగా నాడు సేకరించిన భూముల్లో రూ.కోట్లు కొల్లగొట్టారు. అతి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేయడం.. వాటినే అత్యధిక ధరకు ప్రభుత్వానికి అంటగట్టారు. ఈ కొనుగోళ్ల వ్యవహారంలో భారీ కుంభకోణాలు ఉన్నాయని నాడు ప్రతిపక్షంలో ఉన్న కూటమి పార్టీలు ఆందోళనలు చేశాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఆ కొనుగోళ్ల కుంభకోణాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో నాటి భూ మాయలో భాగస్వాములుగా ఉన్న వైసీపీ నేతలు, అధికారుల గుండెల్లో వణుకు మొదలైంది. విజిలెన్స్ విచారణ పక్కాగా జరిగితే మూడు జిల్లాల పరిధిలో భారీ భూ స్కాంలు వెలుగుచూస్తాయని ప్రజలతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు అభిప్రాయ పడుతున్నారు.

(గుంటూరు, బాపట్ల-ఆంధ్ర జ్యోతి)

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే జగనన్న కాలనీల పేరుతో భూసేకరణ జరిగింది. భూసేకరణ ఎక్కడైనా రెవెన్యూ శాఖ కనుసన్నల్లో జరుగుతుంది. కానీ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో మాత్రం అంతా అప్పటి ఎమ్మెల్యేలు, వైసీపీ నేతల పర్యవేక్షణలోనే జరిగింది. భూముల ధరలను ఆసాంతం పెంచేసి ప్రభుత్వానికి వాటిని స్వాధీనం చేసి కొద్ది రోజుల్లోనే రూ.కోట్లకు పడగలెత్తారు. పేదలందరికీ ఇళ్లు అని చెబుతూ వైసీపీ నేతలు కొనుగోళ్ల కుంభకోణానికి తెర లేపారు. భూసేకరణలో పెద్ద ఎత్తున ధర వెచ్చించి వాటిని

జగనన్న కాలనీలకు భూసేకరణలో అక్రమాలు

కొనుగోలు చేసే ఇన్‌సైడర్ ట్రేడింగ్ ప్రక్రియ గత ప్రభుత్వంలో పెద్ద ఎత్తున సాగింది. ఈ అక్రమాలకు వైసీపీ కీలక నేతల సహకారంతో పాటు కొంతమంది అధికారుల సహకారం కూడా ఉండడంతో రాజమార్గంలో ప్రభుత్వ ఖజానాకు గండికొట్టి రూ.కోట్లు కొల్లగొట్టేశారు. ముంపుప్రాంతాలు, శ్మశానాల సమీపంలో, ఊరికి చివరన జనసంచారం లేని చోట భూములను సేకరించి వాటిని జగనన్న లేఅవుట్లగా మార్చారు. కొందరు ఎమ్మెల్యేలు అయితే భూ యజమానులతో ముందుగానే ఒప్పందాలు చేసుకున్నారు. మీ భూమికి మంచి ధర ఇప్పిస్తామని, అందుకు గాను తమకు 5 శాతం కమీషన్ ఇవ్వాల్సి ఉంటుందని మాట్లాడుకుని భూసేకరణ కింద భూములు ఇప్పించారు. అప్పట్లో తెనాలి మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనంద బాబు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఈ భూదోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు జరిపారు. అయితే వారి గళం అరణ్యరోదనైంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఈ భూ కుంభకోణంపై విచారణ జరిపితే వైసీపీ నేతల జేబుల్లోకి పోయిన ప్రజాధనం (మిగతా 6వ పేజీలో)

తెనాలి నుంచి బీజం

భూసేకరణలో లోగడ కుంభకోణాలు జరిగిన దాఖలాలు లేవు. అలాంటిది ఇందులోనూ అవినీతికి పాల్పడొచ్చని వైసీపీ నేతలు చేసి చూపించారు. తొలుత తెనాలి నుంచి ఈ కుంభకోణానికి బీజం పడింది. సర్వే నంబర్లను ముందుగానే తహసీల్దార్ల ద్వారా తెలుసుకుని ఆ భూములను ఎమ్మెల్యేలు వారి అనుచరుల ద్వారా కొనుగోలు చేశారు. ఆయా సర్వే నెంబర్లలో అప్పటి వరకు ఎకరం రూ.10 లక్షలుంటే ఒక్కసారిగా రెండు, మూడు రెట్లు పెంచి రిజిస్ట్రేషన్లు జరిపించారు. దాంతో వాటిల్లో సగటు భూమి రిజిస్ట్రేషన్ విలువ పెరిగింది. దానిని ప్రభుత్వానికి ఇవ్వడం ద్వారా అర్బన్‌లో అయితే ఒకటి, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 1.25 విలువని అదనంగా గుణకారం చేసి ఆ మొత్తాన్ని నష్టపరిహారంగా నాటి నేతలు జేబుల్లో వేసుకున్నారు.



చిన్నపాటి వర్షానికే బాపట్ల పరిధిలోని ప్యాడిసన్‌పేట జనన్న కాలనీ దుస్థితి(ఫైల్ ఫొటో)


400 ఎకరాలు.. రూ.1300 కోట్లు

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 400 ఎకరాలకు పైగానే భూసేకరణ చేసి రూ.1300 కోట్ల పైచిలుకు ప్రజాధనాన్ని ప్రభుత్వ ఖజాన నుంచి చెల్లించారు. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే పేదల ఇళ్లకు అడ్డుపడతారా అని ఎదురుదాడికి దిగేవారు. అప్పట్లో భూసేకరణని పర్యవేక్షించిన రెవెన్యూ అధికారులు కూడా పండిపోయారు. ఊహించనంత ధర వస్తుండటంతో సంప్రదింపుల ద్వారానే భూసేకరణ ప్రక్రియ పూర్తి అయింది. జిల్లా స్థాయి అధికారి ఒకరైతే సూట్‌కేసులకు సూట్‌కేసుల నగదుని తీసుకెళ్లారని అప్పట్లో వైసీపీ నేతలే గుసగుసలాడారు.

ముందస్తుగానే.. పండుగ



- రాజధాని రైతులకు కౌలు విడుదల
- అమరావతి రైతుల్లో ఆనందోత్సాహాలు
- సీఆర్డీఏకు రాష్ట్ర ప్రభుత్వం రూ.255 కోట్లు విడుదల
- కౌలుకు రూ.229.7 కోట్లు.. పింఛన్లకు రూ.25.96 కోట్లు
- ఎట్టకేలకు అసైన్డ్ రైతుల మూడేళ్ల బకాయిలకూ మోక్షం



గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరం సమీపిస్తోంది. పండుగను ఆనందోత్సాహాల మధ్య కుటుంబసభ్యులు, బంధువుల సమక్షంలో స్వగ్రామాల్లో జరుపుకునేందుకు దూరప్రాంతాల నుంచి తరలి వస్తోన్నారు. అయితే నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతుల ఇళ్లలో ముందస్తు గానే పండుగ సంబరం నెలకొంది. రాజధాని రైతులకు రావాల్సిన కౌలు బకాయిలు, పేదలకు అందాల్సిన పింఛన్లు అందించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఏపీసీఆర్డీఏ ప్రతిపాదనల మేరకు 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాలుగో క్వార్టర్ నిధుల కింద రూ.255 కోట్ల నిధులను రెండు రోజుల క్రితం విడుదల చేసింది. గతంలో కౌలు, పింఛన్ల కోసం ఎదురుచూపులతో సరిపెట్టాల్సి వచ్చేదని కూటమి ప్రభుత్వంలో ఆ బాధ తప్పిందని ఇప్పటికి రెండు విడతల కౌలు అందిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పదో ఏడాది కౌలుకు మోక్షం

సీఆర్డీఏ ఒప్పందం ప్రకారం రాజధాని కోసం భూములిచ్చిన రైతు లకు ప్రతి ఏటా వార్షిక కౌలు చెల్లించాలి. 2019 లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కౌలు ఎగవేస్తూ వారిని ఐదేళ్లుగా ఇబ్బం దులపాలు చేసింది. న్యాయస్థానాల ద్వారా పోరాడి రైతులు మూడేళ్లపాటు కౌలు సాధించుకున్నారు. హైకోర్టు తీర్పును సైతం ధిక్కరిస్తూ చివరి రెండేళ్ల కౌలును వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. దీంతో వారికి 9, 10 సంవత్సరాలకు చెందిన వార్షిక కౌలు అందలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలు చెల్లింపులకు చర్యలు తీసుకుంది. కిందటేడాది ఆగస్టులో వారికి తొమ్మిదో ఏడాది వార్షిక కౌలు బకాయిలు చెల్లించింది. రైతులకు అందాల్సిన రూ.220 కోట్ల బకాయిలు చెల్లించింది. కాగా పదో ఏడాది వార్షిక కౌలు పెండింగులో ఉండగా దానికి సంబంధించి రైతుల నుంచి సీఆర్డీఏకు భారీగా విజ్ఞప్తులు వెళ్లాయి. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను కూడా రైతులు మంత్రులు లోకేశ్, నారాయణలను కలిసి తమ గోడు వినిపించు కున్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. పండు గపూట వారికి తీపి కబురు అందించింది. రాజధాని రైతుల కౌలు చెల్లింపులకు కావాల్సిన నిధులు విడుదల చేస్తూ బుధవారం రాత్రి జీవో జారీ చేసింది. ఏపీ సీఆర్డీఏకు రూ. 229.71 కోట్లు విడుదల చేసింది.

అసైన్డ్ రైతులకూ పండుగే...

రాజధానికి భూములిచ్చిన అసైన్డ్ రైతులను గత వైసీపీ ప్రభుత్వం తీవ్రంగా వేధించింది. వారి భూములపై సీఐడీ విచారణకు ఆదేసించి, వాటిని నాట్ ట్యాలీడ్ జాబితాలో పెట్టి మూడేళ్లుగా వారికి రావాల్సిన కౌలు ఆపేసింది. దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురై, అప్పులపాలయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 3,120 మంది రైతులను దశలవారీగా సీఐడీ కేసుల నుంచి విముక్తి చేసి, వారికి కౌలు చెల్లించేందుకు పూనుకుంది. ఇప్పటికే వారికి సంబంధించిన కౌలు ప్రతిపాదనలు ఆర్థిక శాఖకు వెళ్లినా నిధులు లేకపోవడంతో అది పెండింగులో పడింది. తాజాగా ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో వారికి కౌలు కష్టాలు తీరనున్నాయి. మూడేళ్ల కౌలు వారికి అందిస్తామని సీఆర్డీఏ అధికారులు చెబుతున్నారని అసైన్డ్ రైతులు చెబుతున్నారు.

పింఛన్లకూ ధోకా లేదు

రాజధాని పరిధిలోని భూమి లేని నిరుపేదలకు పింఛను అందజేస్తామని అప్పట్లో టీడీపీ ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి నెలా వారికి రూ.5 వేలు చొప్పున పింఛను అందించాల్సి ఉంది. ఆ పింఛన్లకు కూడా ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రభుత్వం నిధులు కేటాయించింది. రూ.25.96 కోట్లు సామాజిక భద్రతా నిధి కింద విడుదల చేసింది. రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

హోరాహోరీగా ఎడ్ల పోటీలు



పోటీలో తలపడుతున్న గుంటూరు జిల్లా ఎడ్ల జత

అన్నంబొట్లవారిపాలెం(పర్చూరు), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రత్తయ్యచౌదరి మెమోరియల్ ప్రాంగణంలో రెండో రోజైన శనివారం ఆరు పళ్ల విభాగంలో నిర్వహించిన పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 11 జతల ఎడ్లు పాల్గొన్నాయి. వేటపాలేనికి చెందిన శిరీషచౌదరి ఎడ్ల జత 4800 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతిని సాధించాయి. గుంటూరు జిల్లా మేడికొండూరుకు చెందిన శ్రీనివాసరెడ్డి ఎడ్లు, పెదపరిమికి చెందిన శ్రీలక్ష్మి ఎడ్లు 4500 దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. బి.సుశ్మిత చౌదరి ఆకులపాడు (గుంటూరు)కు చెందిన ఎడ్లు 3,626 దూరం లాగి తృతియస్థానం, ఎన్.వెంకటరావు కొల్లవారిపాలెం (బాపట్ల) 3557 దూరంలాగి నాల్గో స్థానం, ఎం.అంజిరెడ్డి చెల్లగుండ (పల్నాడు జిల్లా) 3427 దూరం లాగి ఐదో స్థానం, వై.హుస్సేన్ ఎర్రగొండపాలెం (ప్రకాశం జిల్లా)కు చెందిన ఎడ్లు 3389 అడుగుల దూరం లాగి ఆరోస్థానంలో నిలిచాయి.

గ్రామ స్వరాజ్యానికి బాటలు

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

గోవాడలో సీసీ రోడ్లు, గోకులాల ప్రారంభోత్సవంలో మంత్రి గొట్టిపాటి



గోవాడలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్వరాజ్యం, పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి మండలం గోవాడలో ఉపాధి నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, గోకులాలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో ఉపాధి నిధులతో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు, గోకులాల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు నెలల్లోనే 12,500 గోకులాలను నిర్మించినట్లు చెప్పారు. బాపట్ల జిల్లాలో రూ.14.76 కోట్లతో 683 గోకులాలు మంజూరు చేశామన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో 260 షెడ్లు మాత్రమే నిర్మించారన్నారు. నిధుల దుర్వినియోగం తప్ప వైసీపీ ప్రభుత్వం పాడి పరిశ్రమకు చేసింది శూన్యమన్నారు. వైసీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై పూర్తి నిర్లక్ష్యం వహించిందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డ్వామా పీడీ విజయలక్ష్మి, ఏపీడీ కోటయ్యనాయక్, తహసీల్దారు శ్రీచరణ్, ఎంపీడీవో శింగయ్య, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ







ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత





కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మి (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

పల్లె ప్రగతికి గోకులాలు దోహదం

ఎమ్మెల్యే కొండయ్య



లేగదూడకు అరటిపండు తిని పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : పల్లె ప్రగతికి ప్రభుత్వం గోకులాలకు అందిస్తతన్న సహకారం ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. చీరాల నియోజకవర్గంలో రూ.2.27కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 97 గోకులాలకు సంబంధించి శనివారం ఆయన ప్రారంభోత్సవం చేశారు. అక్కాయిపాలెంలో 16, చల్లారెడ్డిపాలెంలో 19 గోకులాల షెడ్లు, ఒక షీప్ షెడ్‌ను ఎమ్మెల్యే కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అనుబంధ వృత్తిగా ఉన్న పశుపోషణ, జీవాల పెంపకానికి అందిస్తున్న చేయూతను ఆయా వర్గాలవారు వినియోగించుకోవాలని కొండయ్య సూచించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసే, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు మంత్రి గొట్టిపాటి పరామర్శ

అద్దంకిటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మండలంలో మృతి చెందిన పలు బాధిత కుటుంబాలను శనివారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. ఈ క్రమంలో మండలంలోని చక్రాయపాలెం గ్రామానికి చెందిన తిరుపతి నాగరాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాగరాజు మృతికి తమ సంతాపాన్ని తెలియజేశారు. అలాగే ఏలూరి సింగారావు, మల్లిపెద్ది రాంబాబు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించారు శ్రీనివాసనగర్‌కు చెందిన నూతి నవీన్‌కుమార్ మృతి చెందగా మంత్రి పరామర్శించారు. హరికృష్ణ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆరోగ్య పరిస్థితిని ఆడిగి తెలుసుకున్నారు.

మేదరమెట్ల : ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను మంత్రి గొట్టిపాటి పరామర్శించారు. శనివారం కొరిశపాడులో గోలి శ్రీనివాసులు దశ దిన కర్మకు హాజరై చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన సోదరుడు మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గోలి హరిబాబును, శ్రీనివాసులు కుమారులను మంత్రి పరామర్శించారు. కొరిశపాడులోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గౌతమ్ తండ్రి యేసయ్యను మంత్రి రవికుమార్ పరామర్శించారు. పమిడిపాడులో ఎంపీటీసీ మాజీ సభ్యుడు యరజాని పరిశుద్ధరావు కుమారులు వంశీ మృతి చెందగా వారి నివాసానికి వెళ్లి వంశీ మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు జాగర్లమూడి జయకృష్ణ, ఎడెం భవానీప్రసాద్‌రెడ్డి, మేదరమెట్ల శ్రీనివాసరావు, చెన్నుపాటి హరిబాబు, సింగమనేని వాసు, సింబోతు సత్యనారాయణ, నాగేశ్వరరావు, గురుబాబు ఉన్నారు.

సుబ్బయ్య మృతదేహానికి నివాళి

పంగులూరు : రోడ్డు ప్రమాదానికి గురై టీడీపీ నేత వజ్జా సుబ్బయ్య మృతి చెందడం బాధాకరమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని అలవలపాడు గ్రామంలో మంత్రి గొట్టిపాటి శనివారం వజ్జా సుబ్బయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. తూర్పు కొప్పెరపాడు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన నాదెండ్ల శ్రీమన్నారాయణ దశదిన కర్మలో పాల్గొన్న ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అలవలపాడు గ్రామంలో ఇటీవల మరణించిన టీడీపీ నేత గొట్టిపాటి కోటేశ్వరరావు నివాసానికి వెళ్లిన మంత్రి గొట్టిపాటి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట జడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీ సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, షేక్ మస్తాన్‌వలి, కోమటి ప్రసాద్, గుర్రం ఆదిశేఖర్, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, పచ్చా శ్రీను, భానుప్రకాష్, వరపర్ల సుబ్బారావు, జార్లమూడి శ్రీనివాసరావు, ధూళిపాళ్ల శ్రీను, ఉన్నం రవిబాబు, పెదవల్లి అశోక్, చిలుకూరి వెంకటేశ్వర్లు, గొల్లపూడి అంజయ్య. ఎనికపాటి శ్రీను, నేతలు పాల్గొని నివాళి అర్పించారు.

స్టేట్ హైవేలను నేషనల్ హైవేలుగా మార్చాలి

- కేంద్రానికి ఎమ్మెల్యే ఏలూరి లేఖ
- స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీ



పర్చూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా పరిధిలోని పర్చూరు నియోజకవర్గంలోని ప లు కీలక స్టేట్ హైవేలను నేషనల్ హైవేలుగా మార్చాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రాసిన లేఖకు కేంద్ర మంత్రి నితిన్ గట్కరీ స్పందించారు. ఎమ్మెల్యే ఏలూరి లేఖకు ఆయన సమాధానం తెలిపినట్లు శనివారం ప్రకటనలో ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. తక్షణమే స్టేట్ హైవేలను నేషనల్ హైవేలుగా మార్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని ఇందులో ఒక ప్రత్యేక అధికారిని పంపిస్తామని లేఖలో పేర్కొన్నారన్నారు.

ఎమ్మెల్యే ఏలూరి ప్రతిపాదించిన హైవేల వివరాలు

గుంటూరు - నాగులప్పలపాడు వయా ప్రత్తిపాడు, పెదనందిపాడు, పర్చూరు, ఇంకొల్లు మీదుగా నాగులుప్పలపాడు వరకు 83.120 కిలోమీటర్లు స్టేట్ హైవేని నేషనల్ హైవేగా మార్చాలని ఎమ్మెల్యే ఏలూరి కోరారు. అద్దంకి టు మోటుపల్లి వయా రేణింగివరం, అలవలపాడు, చందలూరు, కొణికి, ఇంకొల్లు మీదుగా మోటుపల్లి వరకు 40.90 కిలోమీటర్లు స్టేట్ హైవేని నేషనల్ హైవేగా మార్చాలని వివరించారు. అదేవిధంగా బాపట్ల టు మార్టూరు వయా నర్సాయపాలెం, కంకటపాలెం, చెరుకూరు, వీరన్నపాలెం, కొమర్నేనివారిపాలెం, ఉప్పుటూరు, పర్చూరు, యద్దనపూడి, మీదుగా దేగరమూడి ఎన్‌హెచ్-16 వరకు 53 కిలోమీటర్లు రహదారిని జాతీయ రహదారిగా మార్చాలని ఎమ్మెల్యే ఏలూరి కేంద్ర మంత్రి నితిన్ గట్కరిని కోరారు.

దిగువ ప్రాంత భూములకు నీరివ్వండి

అధికారులకు మంత్రి ఆదేశాలు



ఎస్ఈతో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

పంగులూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పమిడిపాడు మేజర్ పరిధిలో పంటలకు తక్షణమే సాగు నీరందించాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం తూర్పు కొప్పెరపాడు వచ్చిన మంత్రి రవికుమార్‌ను కలిసిన రైతులు పంటలకు సాగు నీరందక పడుతున్న ఇబ్బందులు ఏకరువు పెట్టారు. రోజుల తరబడి సాగు నీటి కోసం ఎదురు చూస్తున్నామని, సాగు నీరు అందక పోతే పంట చేతికి దక్కని పరిస్థితి నెలకుందని పలువురు రైతులు మంత్రికి వివరించారు. సమస్యపై స్పందించిన మంత్రి గొట్టిపాటి జిల్లా ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడుతూ దిగువ ప్రాంతానికి సాగు నీరందక రైతులు ఇబ్బంది పడుతుంటే యంత్రాగం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పమిడిపాడు మేజర్‌పై పర్యటించి వెంటనే నీటి విడుదలకు చర్యలు చేపట్టాలని సూచించారు. కింది స్థాయిలో అధికార యంత్రాంగాన్ని తక్షణమే సమావేశ పరచి అప్రమత్తం చేయాలన్నారు ప మిడిపాడు మేజర్‌పై తూర్పుకొప్పెరపా డు, తక్కెళ్లపాడు, చందలూరు, నూజెళ్లపల్లి గ్రామాలలో సాగులో ఉన్న పంటలకు సాగునీరు అందేలా వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంత్రి వెంట నేతలు కేవీ సుబ్బారావు, చింతల సహదేవుడు, రామాంజనేయులు, శ్రీనివాసరావు, చిలుకూరి వెంకటేశ్వర్లు, కాజా ఉన్నారు.

కొనుగోళ్లలో.. కుంభకోణం

(5వ పేజీ తరువాయి)

లెక్క తేలుతుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. భూసేకరణకు సంబంధించిన ఫైళ్లన్నీ కలెక్టరేట్ రెవెన్యూ విభాగం వద్ద భద్రంగా ఉన్నాయి. విజిలెన్స్ కనుక ఆ ఫైళ్లను తీసుకుని విచారణ జరిపితే అక్రమాలు ఇట్టే వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నది. ఈ కుంభకోణంలో ఒక రిటైర్డు ఉన్నతాధికారి పాత్ర ప్రముఖంగా ఉన్నట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. అలానే జాయింట్ కలెక్టర్లు, ఆర్‌డీవోలు, తహసీల్దార్ల పాత్రలు కూడా బయటపడతాయి.

కాలనీలు.. కన్నీళ్లు

ఇళ్ల కోసం స్థలాలను పెద్ద మొత్తంలో డబ్బు వెచ్చించి కొనేటప్పుడు అవి నివాసయోగ్యమా కాదా అనే అంశంతో పాటు లోతట్టు ప్రాంతమా, వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉందా అన్న అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. కానీ నాటి భూసేకరణలో కేవలం ఎంత మొత్తంలో కొల్లగొట్టవచ్చు అన్న దానికే నేతలు పరిమితం కాగా వారికి అధికారులు పూర్తిగా సహకరించారు. దీంతో మూడు జిల్లాల పరిధిలోని అనేక ప్రాంతాల్లోని లేఅవుట్లలో స్థలాలు నివాసయోగ్యంగా లేవు. దీంతో లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు వెనుకంజ వేయడంతో ప్రస్తుతం అవి అడవులను మరపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో భూములు కొనడంతో వాటిని మెరక చేయడానికి పెద్ద ఎత్తున మట్టి తోలి ఈ క్రాంటాక్టుల్లో కూడా పెద్దమొత్తంలో నేతలు లబ్ధి పొందారన్న ఆరోపణలున్నాయి.

అక్రమాల్లో మచ్చుకు కొన్ని

- తాడికొండ నియోజకవర్గంలో వాగు, చెరువు పోరంబోకు భూములను కూడా భూసేకరణ చేయించి సొమ్ము చేసుకున్నారు.

జొన్నలగడ్డలో ఎకరానికి రూ.80 లక్షలకు పైగా చెల్లించారు. - తెనాలికి సమీపంలోని జంపనిలో ఎకరానికి రూ.55 లక్షలు చెల్లించారు. వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులో ఎకరానికి రూ.52 లక్షలు చెల్లించారు. కొల్లూరులోని మొసలిపాడులో ఎకరానికి రూ.30 లక్షలు చెల్లించారు. పొన్నూరులోని దండమూడిలో రూ.50 లక్షలు ఇచ్చారు. వినుకొండలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పనికి రాని భూములనే ఎకరం రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు చెల్లించి సేకరించారు.

- బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండల పరిధిలోని ఓ గ్రామంలో ఎకరం 25 లక్షల ధర ఉంటే ఇక్కడ జగనన్న కాలనీల భూసేకరణ పేరిట దాదాపు రూ.75 లక్షలు వెచ్చించారు.

- ఈస్ట్ బాపట్ల పరిధిలో 35 ఎకరాల అసైన్డ్ భూమని అప్పట్లో సేకరించారు. ఇందుకోసం ఇచ్చిన పరిహారం దాదాపు రూ.25 కోట్లుకాగా ఇందులో అధిక మొత్తం వైసీపీ నేతల జేబుల్లోకే పోయిందన్న ఆరోపణలు ఉన్నాయి. వేమూరు నియోజకవర్గ పరిధిలో కూడా పేదలకు ఇళ్ల స్థలాల పేరిట భారీ దోపిడీ జరిగినట్లు తెలుస్తోంది. బాపట్ల జిల్లాలో 287 లే అవుట్లను వేయగా దాదాపు 55 లే అవుట్ల కోసం చేసిన భూసేకరణ అనుమానంగా ఉండడతో రెవెన్యూ యంత్రాంగం వాటిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది.

హోరాహోరీగా పోటీలు

బౌలర్‌లకు అనుకూలిస్తున్న పిచ్



చెన్నై, తిరుపతి జట్ల మధ్య జరుగుతున్న పోటీ

వేమరమెట్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : రావినూతలలో శ్రీ భ్రమర సంక్రాంతి కప్- 2025 క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. బౌలర్లకు పిచ్ అనుకూలంగా ఉండడంతో భారీ స్కోర్‌లు నమోదు కావడం లేదు. శనివారం ఉదయం ఇండియన్ బ్యాంక్స్ ఎస్ఎన్ఆర్‌సీ చెన్నై, తండర్ బోల్ట్ తిరుపతి జట్ల మధ్య పోటీ జరిగింది. తిరుపతి జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన చెన్నై జట్టు నిర్ణీత 20ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 125 పరుగులు చేసింది. ఈ జట్టులోని బ్యాట్స్‌మన్ నిచల్ 36 బంతులలో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 47 పరుగులు సాధించాడు. తిరుపతి జట్టులోని అచ్చుతానందా 4ఓవర్లు బౌలింగ్ చేసి 14 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తండర్ బోల్ట్ తిరుపతి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 115 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఇండియన్ బ్యాక్స్ ఎస్ఎన్ఆర్‌సీ చెన్నై జట్టు 10 పరుగుల తేడాతో తండర్ బోల్ట్‌పై విజయం సాధించింది.

సాయంత్రం జరిగిన ఎస్‌సీ రైల్వే విజయవాడ, ఎస్‌కేఎన్ సీసీ లెవెన్ చెన్నై జట్ల మధ్య పోటీ జరిగింది. ఎస్‌సీ రైల్వే విజయవాడ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 15.4 ఓవరల్లలో 10వికెట్లు కోల్పోయి 51 పరుగులు మాత్రమే చేయగలిగింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఎన్‌సీసీ లెవెన్ చెన్నై జట్టు 4.5 ఓవర్లలో 2 వి కెట్లు కోల్పోయి 55 పరుగులు చేసింది. ఈ జట్టులోని బ్యాట్స్‌మన్ హిమాలయ 11 బంతులలో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 31 పరుగులు సాధించాడు. రైల్వే విజయవాడ జట్టుపై ఎస్‌కేఎన్ సీసీ లెవెన్ చెన్నై 8 వి కెట్లు తేడాతో విజయం సాధించింది. ఈ పోటీలకు ఎంపైర్‌లుగా శ్రీనివాస్, రాజాలు, స్కోరర్‌గా సాయిరాజ్ వ్యహరించారు.

నేటి పోటీల వివరాలు

ఆదివారం ఉదయం సౌత్ జోన్ సీసీ చెన్నై, లైన్స్ సీసీ బెంగళూరు జట్ల మధ్య పోటీ జరుగుతుంది. సాయంత్రం జీఎస్‌టీ అండ్ సీఈ లెవెన్ చెన్నై, వైట్ ఫీల్డ్ సీప లెవెన్ బెంగళూరు జట్ల మధ్య పోటీ జరుగుతుందని రావినూతల స్పోర్ట్ అండ్ కల్చరల్ అ సోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కారుసాల నాగేశ్వరరావు(బాబు), మోపర్తి శేషారావు తెలిపారు.

పెవిలియన్ బిల్డింగ్‌ను ప్రారంభించనున్న రవికుమార్

రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రావినూతలలో స్టేడియంలో నిర్మించిన పెవిలియన్ బిల్డింగ్‌ను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం సాయంత్రం 3 గంటలకు ప్రారంభిస్తారని అసోసియేషన్ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు(బాబు) తెలిపారు.


బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

క్రీడలతో స్నేహ పూర్వక పోటీ

క్రికెట్ పోటీల ప్రారంభంలో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో స్నేహపూర్వక పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. పేరాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్, ఫుట్‌బాల్ పోటీలను ఎమ్మెల్యే కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ క్రీడలతో దేహదారుఢ్యంతో పాటు మానసిక వికాసం పెంపొందుతుందన్నారు. ఆక్రమంలో ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభించారు. ఆ సందర్భంగా గోల్ చేసి క్రీడాకారుల నుంచి అభినందనలు అందుకున్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, నిర్వాహాలు పాల్గొన్నారు.

పాసుపుస్తకాలకు రూ.4వేలు వసూలు

» రెవెన్యూ అధికారులపై మంత్రికి రైతుల ఫిర్యాదు » భూ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు : గొట్టిపాటి


మంత్రి రవికుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

అద్దంకి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టాదారు పాసుపుస్తకాల కోసం గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు రూ.4 వేల తీసుకున్నారని రైతు ప్రేమచంద్రరావుతో పాటు పలువురు రైతులు మం త్రి రవికుమార్ దృష్టికి తీసుకు వచ్చారు. దీనికి స్పందించిన మంత్రి రవికుమార్ రైతులు తగు ఆధారాలతో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల ద్వారా చర్యలు తీసుకునే వీలు ఉంటుందన్నారు. గోవాడలో శనివారం పలు గ్రా మాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను మంత్రి రవికుమార్ దృష్టికి తీ సుకు వచ్చారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ భూసమస్యలు చిన్నవే కదా అని నిర్లక్ష్యం చేస్తే జఠిలమై జీవితాంతం పరిష్కారం కాకుండా మిగిలిపోయే అవకాశం ఉందన్నారు. మైలవరం చెరువు మధ్యలో పట్టా భూమి ఉందని కొంత మంది గత ప్రభుత్వంలో రైతుల పై కేసులు నమోదు చేశారని తక్షణమే పరిష్కరించాలన్నారు. విద్యుత్ హెల్పర్ లేక 7 సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు మంత్రి దృష్టికి తీ సుకు రావడంతో నియోజకవర్గంలో ఉన్న విద్యుత్ సిబ్బందిని సర్దుబాటు చేసి ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే వ్యవసాయ కనెక్షన్లను మంజూరు చేయాలన్నారు. పూర్తిగా శిథిలమైన గోవాడ, మైలవరం తారు రోడ్లు త్వరలో పునఃనిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పింఛన్‌ల పొందుతున్న వారిలో అనర్హులు ఉంటే తొలగించాలని, అర్హుల నుంచి కొత్త పింఛన్‌లకు దరఖాస్తులు తీసుకోవాలని, ప్రభుత్వం త్వరలో మం జూరు చేయడం జరుగుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో సగం బడ్జెట్ పింఛన్‌లకు ఖర్చు అవుతుందన్నారు. నియోజకవర్గంలో ఉన్న చుక్కల భూముల జాబితా సిద్ధం చేసి పరిశీలన చేయాలన్నారు. 2014-19 మధ్య కాలంలో ఇళ్ల నిర్మాణం చేసుకొని బిల్లులు జమ కాకపోతే ప్రస్తుతం ఇవ్వడం జరుగుతుందన్నారు. నిరుపయోగంగా మారిన ధర్మవరం మంచి నీటి పథకం స్థితి గతులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. గతంలో ఉన్న అద్దంకి క్లస్టర్‌ను మరలా ఏర్పాటు చేయాలని డ్వామా అధికారులను మంత్రి ఆదేశించారు. కార్య క్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రకర్ జైన్‌తో పాటు స్థానిక అధికారులు, టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, మానం మురళీమోహన్‌దాస్, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దివకోలు రాధాకృష్ణ, స్వయంపు సురేష్, బైరపునేని సత్యనారాయణ, పుట్టా సాంబశివరావు, మాకినేని ఏడుకొండలు పాల్గొన్నారు.


ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వడ్డెరలు

ఘనంగా ఓబన్న జయంతి

చీరాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలను శనివారం హరిప్రసాద్‌నగర్, జవహర్‌నగర్, ఉజిలీపేటలో నివశించే వడ్డెరలు ఘనంగా జరుపుకున్నారు. ఓబన్న చిత్రపటానికి పూలమాలలువేసి నివాళుల ర్పించారు. అనంతరం ప్రభుత్వం అధికారికంగా గుంటూరు నిర్వహిస్తున్న ఓబన్న జయంతి వేడుకలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వడ్డెర్ల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వల్లెపు వేణుబాబు, చిన్న వెంకయ్య, గుంజి శ్రీనివాసరావు, యేసుబాబు, నాగరాజు, తిరుపతయ్య తదితర సంఘీయులు పాల్గొన్నారు.

రేపు అద్దంకి ఆణిముత్యాలు పుస్తకావిష్కరణ

అద్దంకిటౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : సత్య హరిచంద్ర పాత్రదారి బండారు రామారావు జీవిత చరిత్రపై ఈ నెల 13వ తేదీన అద్దంకిలోని నంబూరివారిపాలెంలో మధ్యాహ్నం 3 గంటలకు అద్దంకి ఆణిముత్యాలు బండారు బదర్స్ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు శనివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. కళాకారులు, కళాభిమానులు హాజరు కావాలని కోరారు.

వైసీపీ మండల అధ్యక్షులు వీరే

అద్దంకి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పార్టీలో అద్దంకి నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాలకు పార్టీ అధ్యక్షులను నియమిస్తు అ పార్టీ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అద్దంకి మున్సిపాలిటీ అధ్యక్షునిగా కాకాని రాధాకృష్ణమూర్తి, అద్దంకి రూరల్‌కు గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, బల్లికురవకు దేవినేని కృష్ణబాబు, సంతమాగులూరుకు ఊట్ల నాగేశ్వరరావు, పంగులూరుకు రావూరి శ్రీనివాసరావు, కొరిశపాడుకు పాలపర్తి శ్రీధర్‌ను నియమిస్తు ఉత్తర్వులు వచ్చాయి.

వెంకటేష్‌కు మేరీబాబు కృతజ్ఞతలు


వెంకటేష్‌కు బొకే అందజేస్తున్న మేరీబాబు

చీరాల, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : వైసీపీ పట్టణ అధ్యక్షునిగా నియమితులైన యాతం మేరీబాబు శనివారం హైదరాబాదులో ఉన్న వై సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో పార్టీ అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. పలు అంశాలపై వెంకటేష్ నూతనంగా పట్టణ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన మేరీబాబుకు దిశానిర్దేశం చేశారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్టు

వేటపాలెం (చీరాల), జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కఠారిపాలెం సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో కలసి ముగ్గురిని శనివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 20 కోడి కత్తులు, రూ.1000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కోడి పందేలు చట్ట విరుద్ధమని, ఎవరైనా పందేలను ఆడినా, నిర్వహించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తాని చెప్పారు.

లారీ బోల్తా .. డ్రైవర్ మృతి

మేదరమెట్ల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో మేదరమెట్ల తిమ్మనపాలెం మధ్య లా రీ అదుపుతప్పి బో ల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందాడు. శనివారం వేకువజామున భీమవరం నుండి చెన్నై వెళ్తున్న లారీ మేదరమెట్ల తిమ్మనపాలెం మధ్య వేగం అదుపు కాక అదుపు తప్పి ప క్కన ఉన్న మైలు రాయిని గుద్ది బో ల్తా పడింది. తమిళనాడు రాష్ట్రం పోలదర్ పేటకు చెందిన డ్రైవర్ కన్నియపన్ (45) తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన కన్నియపన్‌ను ఒంగోలు తరలించారు. చికిత్స పొందుతు మృతి చెందినట్లు ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డాక్టరేట్ పొందిన రవికి గ్రామస్థుల సన్మానం

అద్దంకిటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచి ఎన్నో అవరోధాలను ఎదుర్కొని, పేదరికం చదువుకు అడ్డురాదని తన పీహెచ్‌డీతో రవి నిరూపించారని గ్రామస్థులు కొనియాడారు. శనివారం మండలంలోని మణికేశ్వరంలోని ఎస్సీ కాలనీకి చెందిన కత్తి రవి పీహెచ్‌డీని అందుకున్న సందర్భంగా గ్రామస్థులు రవిదంపతులను ఘనంగా సన్మానించారు. రవి యోగివేమన వర్సిటీలో రాజనీతి శాస్త్రం ప్రభుత్వ పాలనా శాస్త్రంలో ఎడ్యుకేషన్ పాలసీస్ ఇన్ ఇండియా ఏ కేస్ స్టడీ ఆఫ్ షెడ్యూల్ క్యాస్ట్ సూడెండ్స్ ఇన్ స్కూల్ ఆఫ్ ప్రకాశం డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధనపై పీహెచ్‌డీ చేసి రెండు రోజుల కిందట డాక్టరేట్‌ను అందుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు కరిముల్లా, మోషే, రామారావు, అబ్దుల్, అనిల్ ఉన్నారు.

పోలీసు లాంచనాలతో ఎస్ఐకి అంత్యక్రియలు

చీరాలటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఈపూరుపాలెం పరిధిలో శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఏఆర్ ఎస్సై మేడిద సంపూర్ణరావు అంత్యక్రియలు పోలీసు లాంచనాలతో ఘనంగా జరిగాయి. సంపూర్ణరావు మృతిపై ఎస్పీ తుషార్‌డూడీ సంతాపం తెలిపారు. అతని కుటుంబానికి పోలీసు విభాగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. ఎస్పీ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు ముగిశాయి. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25వేలను అందజేశారు.

పొగాకు పందిరి దగ్ధం


వేణుగోపాలపురంలో కాలిపోయిన పొగాకు పందిరి

అద్దంకి, జనవరి 11 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని కొటికలపూడి పంచాయతీ పరిధిలో పూనాటి రవీంద్రబాబుకు చెందిన పొగాకు, పందిరి పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు రవీంద్రబాబు తెలిపిన వివరాల మేరకు.. శనివారం మధ్యాహ్నం బ్యారన్‌లో నుంచి పొగాకు పందిరిలో పెట్టే క్రమంలో అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ.5లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. అద్దంకి నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు.

దర్శిలో రేపు ముగ్గుల పోటీలు

దర్శి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 13న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రథమ బహుమతి ఫ్రిజ్, ద్వితీయ, తృతీయ బహుమతులు ఎల్ఈడీ టీవీలు, నాలుగు, ఐదవ బహుమతులు గ్రైండర్‌లు అందజేస్తారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సొలేషన్ బహుమతులు అందజేస్తారు.


గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ మాజీ సభ్యురాలు లక్ష్మి

పాడి రైతుల సంక్షేమానికి కృషి

చినగంజాం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని జడ్పీటీసీ మాజీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మి అన్నారు. మండలంలోని సంతరావూరు గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.30లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు, పశుపోషకులకు ప్రభుత్వం అండగా ఉందని అన్నారు. గత వైసీపీ గోకులం షెడ్లను పూర్తిగా విస్మరించిందన్నారు. కార్యక్రమంలో ఏపీవో జె.లక్ష్మీదేవి, గ్రామ కార్యదర్శి కె.కృపారావు, టీడీపీ నాయకులు కేశనపల్లి శ్యాంబాబు, దేవతోటి నాగరాజు, అతిన సురేష్, దేవరపల్లిరాజేష్, సాల్మన్, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు రామిశెట్టి చంద్రా, పవన్, మహేష్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు గొనసపూడిలో రాష్ట్ర స్థాయి ముగ్గుల పోటీలు

చినగంజాం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొనసపూడి గ్రామంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా ఈ నెల 13వ తేదీన రాష్ట్ర స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహిస్తుంచనున్నట్లు గ్రామ సంక్రాంతి సంబరాల కమిటీ అధ్యక్షుడు పోద శేషగిరిరావు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీ ఉదయం 9గంటల నుంచి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రంగవల్లుల పోటీలలో విజేతలైన ఆడపడుచులకు మెదటి బహుమతిగా రూ.55,555, రెండవ బహుమతిగా రూ.25,555 (ఇద్దరికి), మూడవ బహుమతిగా రూ.10,555 (ముగ్గురికి) అందజేయనున్నట్లు ప్రకటించారు. ముగ్గు వేసే బాక్స్ సైజ్ 77 అడుగులని, ముగ్గు వేయటానికి 90 నిమిషాల గరిష్ఠ సమయం ఇస్తున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సొలేషన్ బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం 5గంటల లోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ముగ్గుల పోటీలో పాల్గొనదలిచిన వారు నార్నె సత్యనారాయణ సెల్ నెంబరు 9849083710, కె.అనిల్ సెల్ నెంబరుకు 8555028775 ఫోను చేసి పేరు, చిరునామ నమోదు చేసుకోవాలని సంక్రాంతి సంబరాల కమిటీ సభ్యులు తెలిపారు.

పర్చూరు రోటరీ సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న రోటరీ గవర్నర్ శరత్

పర్చూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.శరత్ చౌదరి అన్నా రు. క్లబ్ ద్వారా చేపడుతున్న పలు కార్యక్రమాలను ఆయన కొనియాడారు. ప ర్చూరు క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన పలు కార్యక్రమాలను శనివారం పరిశీలించిన అనంతరం స్థానిక రోటరీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ గ్లోబల్ గ్రాంట్ ఉప్పుటూరు - పర్చూరు వాగుపై చెక్ డ్యాం నిర్మాణం చేయాలని గ్రామస్థులు కోరిన విషయాన్ని శరత్‌చౌదరి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ తేళ్ల రమేష్ చంద్ర, కార్యదర్శి కోమటి అంజనేయులు, సభ్యులు నాగభైరు శ్రీనివాసరావు, కొల్లా నరేంద్ర కుమార్, నాగుబడి సుబ్బారావు, కేఆర్‌కే ప్రసాద్, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోటా హరిప్రసాద్, కోటా శ్రీనివాసరావు, కాసా అశోక్ కుమార్, కోడూరి సుబ్రహ్మణ్యాచారి పాల్గొన్నారు.

సారా తయారీపై దాడి

వ్యక్తి అరెస్ట్, 4 లీటర్లు స్వాధీనం

చీరాలటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : చీరాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు ఆదినారాయణపురంలో దాడులు నిర్వహించారు. ఈక్రమంలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద 4 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు.

ఆరు నెలల్లో సంక్షోభం నుంచి సంక్షేమం వైపు

» ఎమ్మెల్యే ఏలూరి
» రూ.80లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, పోలీస్ అవుట్‌పోస్టుకు ప్రారంభోత్సవాలు


ఇంకొల్లులో సీసీ రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

ఇంకొల్లు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : జగన్‌రెడ్డి పాలనలో సంక్షోభంలోకి రాష్ట్రాన్ని, గాడి తప్పిన పాలనను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరు నెలల కాలంలోనే సంక్షేమం దిశగా మళ్లించారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శనివారం ఇంకొల్లులో సుమారు రూ.80లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఏలూరి ప్రారంభించారు. ఇంకొల్లులో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పోలీసు అవుట్ పోస్టును ఆయన ప్రారంభించారు. అనంతరం బస్టాండులో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పాలేరు రామకృష్ణ నిర్మించిన మదర్ ఫీడింగ్ రూంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చంద్రబాబు ఆరు నెలల్లో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు రూపకల్పన చేసారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో విధ్వంసమైన రాష్ట్రం, అస్తవ్యస్తమైన వ్యవస్థలు, అప్పులు వారసత్వంగా వచ్చాయని, ఆ సవాళ్లను అధిగమిస్తూ ప్రజలకు సుపరిపాలన అందించడం చంద్రబాబుకే సాధ్యమవుతుందన్నారు. సినిమా హాలు సెంటర్, స్టాలిన్‌పేట, అంకమ్మకాలనీ వద్ద సీసీ రోడ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఏలూరి వైసీపీ ఐదేళ్లలో ఎక్కడా సీసీ రోడ్డును కూడా నిర్మించలేదని, కూటమి వచ్చిన ఆరు నెలల్లోనూ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం సాగుతోందన్నారు. నియోజకవర్గంలో ఆరు మండాలల్లో రూ.3.30కోట్లతో సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. రూ.9కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులు చేపట్టారన్నారు. రూ.50లక్షలతో కొమ్మమూరు మరమ్మతులతో సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టామని ఏలూరి తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పెద్దపూడి విజయకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, టౌన్ అధ్యక్షుడు మార్క్, పాలేరు రామకృష్ణ, కరి శ్రీను, రోటరీ గవర్నర్ కే శరత్‌చౌదరి పాల్గొన్నారు.

రాములోరికి గంగాళాల సేవ


స్వామి వారికి 108 గంగాళాలతో కూడారై ప్రసాదం

చినగంజాం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలోని సీతా లక్ష్మణ్ హనుమత్ సమేత కోదండరామస్వామి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని కూడారై ప్రసాదం (గంగాళాల సేవ)ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ధనుర్మాసం 27వ రోజు సందర్భంగా 108 గంగాళాలతో స్వామికి మహా నివేదన సమర్పించారు. ఆలయ పూజారి సాయి ఆధ్వర్యంలో స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మహిళా భక్తులు తిరుప్పావై పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వినియోగం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మవారికి గ్రామోత్సవం

పంగులూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : చందలూరు గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి కొలుపు మహోత్సవం శనివారం కనులపండుగగా జరిగింది. వేదపండితులు అమ్మవారికి మహన్యాస పూర్వకంగా ఏకాదశ రుద్రాభిషేకము, లలితసహస్రనామ అర్చన, ఉమా మూలమంత్ర జపం తో అమ్మవారి కళశ ఊరేగింపు జరిగింది. సాయంత్రం లలిత సహస్ర శతనామావళి, దేవీ ఖడ్గమాల పారాయణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి సమయంలో పురుష సూక్త, దుర్గాసూక్త, దేవీసూక్త, రాత్రిసూక్త సహితంగా గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామోత్సవంలో వేలాదిగా భక్తులు పాల్గొని అమ్మవారికి అభిముఖంగా వెనుకకు నడుస్తూ కలశంపై విశేషంగా పూలు, తమలపాకులు చల్లారు. కోలాట ప్రదర్శనతో చిట్టాబత్తిన వంశస్తులు విద్యుత్ దీపాల అలంకరణతో ఏ ర్పాటు చేసిన ప్రభను రామాలయం నుంచి శక్తి స్థలానికి తోడ్కొని వచ్చా రు. బ్రహ్మశ్రీ వేదమూర్తివర్యులు చల్లా సత్యనారాయణశాస్త్రి, పలువురు వేద పండితులు పూజా కార్యక్రమాలు, గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

22మందికి రూ.43 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన మంత్రి గొట్టిపాటి

అద్దంకిటౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజారోగ్యం అంపశయ్యమీద ఉండేదని, కూటమి ప్రభుత్వం వచ్చాకా ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శనివారం చిలకలూరిపేటలోని తన నివాసంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. మొత్తం 22 మందికి రూ.43లక్షల చెక్కులను మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కూటమి ప్రభుత్వం బలహీన వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్‌లకు పరీక్ష

ఇంకొల్లు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు నియోజకవర్గంలోని 7 ఉన్నత పాఠశాలలోని ఎన్‌సీసీ క్యాడెట్లకు ఏ సర్టిఫికెట్ పొందేందుకు శనివారం పరీక్ష నిర్వహించారు. 23వ ఆంధ్రాబెటాలియన్ చీరాల కమాండెంగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్ ఆదేశాల మేరకు 11, 12న జడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎన్‌సీసీ ఆఫీసర్ శ్రీమన్నారాయణ తెలిపారు. శనివారం జరిగిన పరీక్షకు 159 మంది హాజరైనట్లు తెలిపారు. ఆదివారం కూడా పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహాప్రస్థానానికి వాహనం బహూకరణ


వైకుంఠ రథానికి సంబంధించిన పత్రాలను అందజేస్తున్న ప్రతినిధులు

పర్చూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో రూ.కోటి రూపాయల వ్యయంతో దాతల సహకారం, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సౌజన్యంతో రూపుదిద్దుకున్న హిందూ శ్మశాన వాటికకు (మహాప్రస్థానం) రూ.3లక్షల విలువ చేసే వైకుంఠ రథాన్ని ఒంగోలుకు చెందిన కొల్లా వెంకన్న బహూకరించారు. శనివారం ఆ వాహనాన్ని దానికి సంబంధించిన పత్రాలను శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కరారి సురేంద్రబాబు, ఒగ్గిశెట్టి గోవిందరాజులు, నరసింహారావు, మంగళగిరి కోటేశ్వరరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, కృష్ణంశెట్టి శ్రీనివాసరావుకు అందజేసి దాతృత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో లగడపాటి శంకర్, పేర్ని హరి పాల్గొన్నారు.

నేడు మహాప్రస్థాన ప్రారంభోత్సవం

హాజరు కానున్న ఎమ్మెల్యే ఏలూరి

దాతల సహకారంతో పూర్తి హంగులు, సౌకర్యాలతో పర్చూరులో రూపుదిద్దుకున్న హిందూ శ్మశాన వాటిక ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హాజరు కానున్నట్లు వారు తెలిపారు.

యూరియా కోసం ఆందోళన వద్దు!

- ఎంత కావాలన్నా ప్రభుత్వం సరఫరా చేస్తోంది!
- ఇప్పటికే 17 వేల మెట్రిక్ టన్నుల నిల్వ
- అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు
- వ్యాపారుల లైసెన్సులనూ రద్దు చేస్తాం
- 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి



'యూరియా కోసం రైతులు ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం. మన అవసరం మేరకు కేటాయింపులు జరపడమేగాక ఇంకా అవసరమైతే పక్క జిల్లాల నుంచి కూడా దిగుమతి చేసుకునే వెసులుబాటు మనకు ఉంది.' అని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) పి.సత్యవాణి తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరతపై 'ఆంధ్రజ్యోతి'తో ఆమె ముచ్చటించారు. జిల్లా అవసరాల మేరకు ప్రభుత్వం ఎరువులను కేటాయిస్తోందని, అవసరమైతే పక్క జిల్లాలకు కేటాయించిన ఎరువులను కూడా జిల్లాకు అందించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రస్తుతం 17వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉండగా, మరో రెండు రోజుల్లో ఇంకా వస్తుంది. అయితే, రైతుల అవసరాన్ని ఆసరా చేసుకుని అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- వివరాలు 6లో

ఏపీఐఐసీ జడ్ఎంగా శివకుమార్

నెల్లూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఏపీఐఐసీ జిల్లా జోనల్ మేనజర్ (జడ్ఎం)గా ఎల్ శివకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ఈయన తహసీల్దార్ నుంచి డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందగా, తాజాగా జిల్లా జడ్ఎంగా పోస్టింగ్ లభించింది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా 44 మంది డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. జిల్లాలోనూ పలు స్థానాల్లో బదిలీలు జరిగాయి. రామాయపట్నం భూసేకరణ విభాగంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్ విజయకుమార్‌ను ఐటీడీఏ పీవోగా నియమించారు. టీజీపీ రాపూరు యూనిట్ ఎస్‌డీసీగా పనిచేస్తున్న ఎం కిరణ్‌కుమార్‌ను కడప మెప్మా పీడీగా బదిలీ చేసి ఆ స్థానంలో టీ శ్రీనివాసరెడ్డిని నియమించారు.

ఓబన్న ధైర్యసాహసాలు యువతకు స్ఫూర్తి

- డీఆర్వో ఉదయభాస్కర్‌రావు



మాట్లాడుతున్న డీఆర్వో

నెల్లూరు (హరనాథపురం) జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : తొలి తరం స్వాతంత్ర్యం సమరయోధుడు ఓబన్న ధైర్యసాహసాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని డీఆర్వో ఉదయభాస్కర్‌రావు అన్నారు. శనివారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఓబన్న జయంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్న సేవలు వెలకట్టలేనివని అన్నారు. వడ్డెర సంక్షేమ సంఘ నాయకుల విజ్ఞప్తి మేరకు నగరంలో ఓబన్న పేరుతో సామాజిక భవనం, విగ్రహం ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామని చెప్పారు. తొలుత వడ్డెర ఓబన్న చిత్రపటానికి అధికారులు, వడ్డెర సంఘం నాయకులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మి, వడ్డెర సంక్షేమ సంఘ నాయకులు బెల్లంకొండ శ్రీనివాసులు, ఉప్పు భాస్కర్‌రావు, వల్లెపు మునుస్వామి పాల్గొన్నారు.

పండుగ సందడి



నెల్లూరు ప్రధాన బస్టాండులో రద్దీ

ఇవన్నీ భోగి మంటల కోసమే..

నెల్లూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎటు చూసినా జనం.. వస్త్రాలు కొనేవారు కొందరైతే.. బంగారం కొనేవారు ఇంకొందరు.. ఇంట్లో సామగ్రి కొనేవారు మరికొందరు.. ఇలా జిల్లాలోని నగరం, పట్టణాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. పెద్ద పండుగ (సంక్రాంతి) నేపథ్యంలో జిల్లా కేంద్రమైన నెల్లూరులో ఏ వీధి చూసినా జనాలతో కళకళలాడింది. సంక్రాంతికి కొత్త దుస్తులు ధరించాలన్నది హిందువుల సంప్రదాయం. ఈ నేపథ్యంలో నగరంలో వస్త్ర దుకాణాలన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. స్కూళ్లకు కూడా సెలవులు కావడంతో కుటుంబ సమేతంగా షాపింగ్ చేస్తున్నారు. గడిచిన మూడు నాలుగు రోజుల్లోనే రూ.కోట్ల వస్త్ర వ్యాపారం జరిగినట్లు అంచనా. ఇక బంగారు దుకాణాలు కూడా కొనుగోలుదారులతో కళకళలాడాయి. నగర వాసులే కాకుండా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చి అవసరమైన వస్తువులు కొనుగోలు చేశారు. ట్రంకు రోడ్డు, మినీ బైపాస్, స్టోన్‌హౌస్‌పేట, ఆత్మకూరు బస్టాండ్ వంటి ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ఇక ఇతర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వచ్చేవారు.. జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారితో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కూడా సందడిగా మారాయి. జనాల రాకపోకలతో నెల్లూరు నగరంలో ట్రాఫిక్ కూడా విపరీతమైంది. ప్రధాన కూడళ్లు రద్దీగా మారిపోయాయి.

కోడిపందేలు, జూదాలకు అనుమతుల్లేవ్

- నిర్వహిస్తే కఠిన చర్యలు
- ప్రత్యేక బృందాలతో నిఘా
- ఎల్‌హెచ్‌ఎమ్ఎస్ సేవలను వినియోగించుకోవాలి
- జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా జిల్లాలో కోడిపందేలు, ఇతర జూదాలు నిర్వహించరాదని, వాటికి ఎలాంటి అనుమతులు లేవని జిల్లా ఎస్పీ జీ. కృష్ణకాంత్ తెలిపారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఆయన విలేక రులతో మాట్లాడారు. ఎవరైనా పేకాట ఆడినా, ఇతర జూదాలు, కోడిపందేలు నిర్వహించినా, పాల్గొన్నా కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. గతంలో పేకాట, కోడి పందేల్లో అరెస్ట్ వారిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. ప్రత్యేక బృందాలతో జిల్లా వ్యాప్తంగా కోడిపందేలు, జూదాలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. మూగజీవాలను హింసిస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలా పాలపై 112కు సమాచారం అందించాలన్నారు. అధికారులు కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

సంక్రాంతికి ప్రజలు సొంతూర్లకు వెళ్లడంతో చోరీలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూ చించారు. సొంతూర్లు, సుదూర ప్రాంతాలు, విహార, తీర్థయాత్రలకు వెళ్లే వారు ఎల్‌హెచ్‌ఎమ్ఎస్ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఎల్‌హెచ్‌ఎమ్ఎస్ యాప్ ద్వారా, 94407 96383, 93929 03413 నెంబర్ల ద్వారా స్థానిక పోలీసులను సంప్రదించి ఈ సేవలను ఉచి తంగా పొందవచ్చన్నారు. జనసంచారం లేని, అనుమానాస్పద ప్రదే శాలపై ప్రత్యేక దృష్టి ఉంచి గస్తీ నిర్వహించాలని అధికారులను ఆయ న ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీలు ఏ శ్రీనివాసరావు, డీ శ్రీని వాసరెడ్డి, జీ శ్రీనివాసరావు, రాజగోపాల్, చెంచురామారావు, చంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర్వులన్నీ బేఖాతర్!

- మోపాడు చెరువులో చేపల పెంపకం
- ఏమీ పట్టనట్టు ఉన్న పంచాయతీ అధికారులు

- వివరాలు 6లో

స్వయం ఉపాధికి చేయూత

- కార్పొరేషన్లకు నిధుల మంజూరు
- 50 శాతం రాయితీపై బీసీలకు రుణాలు
- 4,434 మందికి లబ్ధి చేకూరేలా ప్రణాళిక
- దరఖాస్తు దాఖలుకు 16 వరకే గడువు
- ఎస్సీలకూ వాహన రుణాలు

వైసీపీ హయాంలో నిర్వీర్యమైన కార్పొరేషన్లకు ఎన్డీఏ కూటమి పునరుజ్జీవం కల్పిస్తోంది. గతంలో కార్పొరేషన్లకు పాలక మండలి ఏర్పాటు చేసినా నిధుల విడుదలలో మాత్రం అప్పటి నాయకులు చేతులెత్తేశారు. పైసా విదల్చకుండా ఐదేళ్లు గడిపేశారు. పదవులు పొందిన నాయకుల్లోనూ తీవ్ర నిరాశ, నిస్పృహ నెలకొంది. అయితే, అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే కూటమి ప్రభుత్వం కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేసింది. వెనుకబడిన తరగతుల వారికి జీవనోపాధి కల్పించేందుకై సబ్సిడీ రుణాలు ఇవ్వనుంది. ఔత్సాహికులంతా దరఖాస్తు చేసుకోవాలంటూ ఇప్పటికే అధికారులు పిలుపునిచ్చారు.

నెల్లూరు (హరనాథపురం), జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన కులాలు, అగ్ర వర్ణాలలోని పేదలకు కూటమి ప్రభుత్వం సంక్రాంతికి తీపి కబురు అందించింది. ఎన్నికల హామీలలో భాగంగా 50 శాతం రాయితీతో స్వయం ఉపాధి యూనిట్లను మంజూరు చేసింది. 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వంలో అమలైన స్వయం ఉపాధి రాయితీ రుణ పథకం మళ్లీ అమలుకు సిద్ధమైంది. అప్పట్లో 50 శాతం రాయితీతో గరిష్ఠంగా రూ.2లక్షల వరకు రుణ భరోసా ఇవ్వగా, ప్రస్తుతం ఆ మొత్తాన్ని రూ.5లక్షల పెంచి మూడు స్లాబ్‌లలో అందించాలని నిర్ణయించింది. స్వయం ఉపాధి యూనిట్లకు స్లాబుల వారీగా రాయితీ కల్పిస్తారు. ఈ రాయితీ రుణాల కోసం దర ఖాస్తు చేసుకోవాలని ఇప్పటికే ఔత్సాహికులకు అధికారులు పిలుపునిచ్చారు. ఇచ్చే రుణాలను కూడా రూ.2లక్షలు, రూ.3లక్షలు, రూ.5లక్షలుగా స్లాబుల విభజన చేశారు. జనరిక్ ఔషధ దుకాణాలకు యూనిట్ విలువ రూ.8లక్షలు కాగా రూ.4లక్షల రాయితీ ఇవ్వనున్నారు. జిల్లాలోని బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు వర్గాలు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. రానున్న నాలుగు నెలల్లో 4,434 మందికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చిన్నతరహా కుటీర పరిశ్రమలు, సేవలు, చేతివృత్తులు, వ్యవసాయం యూనిట్ల ఏర్పాటుకూ అవకాశం కల్పించింది. వీటితోపాటు బీఫార్మసీ చదివిన వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి జిల్లావ్యాప్తంగా 96 జనరిక్ మందుల దుకాణాలను ఏర్పాటు చేయించనున్నారు. అలాగే స్వయం ఉపాధి కల్పనలో మహిళలకు పెద్దపీట వేసింది. వివిధ అంశాల్లో అతివలకు శిక్షణ ఇచ్చి యూనిట్ల ఏర్పాటుకు చేయూత అందించనుంది. ఇందుకోసం జిల్లాకు రూ.70 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం కార్పొరేషన్ల వారీగా లబ్ధిదారులకు రాయితీ రూపంలో రూ.24.20 కోట్లు వెచ్చించనుంది. దీనికి బ్యాంకు రుణాలు వెనుకబడిన తరగతుల ఆర్థిక అభివృద్ధి సంస్థ, లబ్ధిదారుల వాటా కలిపితే రూ.48.55 కోట్లు అవుతాయి. మండలం, గ్రామం, మున్సిపాలిటీల వారీగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది. తరువాత మిగిలిన నిధులు వెచ్చించనున్నారు. వీటితోపాటు రూ.8లక్షల విలువతో జనరిక్ మందుల దుకాణాలకూ అవకాశం కల్పించనుంది. ఇందులో రూ.4లక్షల రాయితీ లభించనుంది. బీఫార్మసీ చేసిన నిరుద్యోగులకు జనరిక్ దుకాణాలు ఏర్పాటు చేసుకునే అవకాశం కలగనుంది. గత వైసీపీ ప్రభుత్వం రూపాయి కూడా కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇవ్వలేదు. పైగా గత టీడీపీ ప్రభుత్వం హయాంలో మంజూరు చేసిన రుణాలను, లబ్ధిదారుల మెడకు కత్తిపెట్టి వసూలు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రుణాలను విడుదల చేసి ఫిబ్రవరిలో యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. అర్హత గల లబ్ధిదారులు ఆధార్, రేషన్‌కార్డులు, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఏపీఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.



ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు..

జిల్లాలోని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకు రుణాలు, లింకేజీ రుణాలు ఇప్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బ్యాంకు లింకేజీ ద్వారా వాహనాలకు రుణాలు ఇవ్వనుండగా, ఈ మేరకు ఇప్పటికే బ్యాంకర్లకు నివేదిక కూడా వెళ్లింది. రూ.లక్ష నుంచి 10లక్షల వరకు లింకేజీ రుణాలు అందే అవకాశం ఉంది. 2019 సంవత్సరానికి ముందు ఎన్ఎఫ్ఎస్‌డీసీ, ఎన్ఎస్‌కేడీసీ పథకాల ద్వారా అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎస్సీ లబ్ధిదారులకు వాహన రుణాలను అందజేసింది. ఎందరో రుణాలు పొంది వాహనాలు కొనుగోలు చేసి జీవనోపాధి పొందారు. సుమారు రూ.25 కోట్ల వరకు రుణాలు లబ్ధిదారులకు అందాయి. ప్రస్తుతం బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా వాహన కొనుగోలుకు ప్రభుత్వం అవకాశం కల్పించనుంది.

ప్రాధాన్య అంశాలు

చేతివృత్తులు, చిన్నతరహా కుటీర పరిశ్రమలు, వ్యవసాయం, డెయిరీ యూనిట్లకు రుణాలు ఇవ్వనున్నారు. వీటితోపాటు దుకాణాలు ఏర్పాటుకూ అవకాశం కల్పిస్తున్నారు. రాయితీ మొత్తం ప్రభుత్వం ఇవ్వనుండగా మిగిలిన 50 శాతం సాయాన్ని రుణంగా బ్యాంకుల నుంచి ఇప్పించనుంది. ఫ్యాషన్ డిజైనింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, హౌస్‌కీపింగ్, ఫుడ్ అండ్ బేవరేజెస్, సర్వీసెస్ సెక్యూరిటీగార్డులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇలా వేలాది మందికి రుణాలు, శిక్షణ ఇవ్వడానికి కార్యాచరణ ప్రణాళి కను జిల్లా వెనుకబడిన తరగతులు సేవా సహకార సంఘం లిమిటెడ్ రూపొం దించింది. బీసీ కార్పొరేషన్ ద్వారా 1328 యూనిట్లు, ఈబీసీ కార్పొరేషన్ 91, కమ్మ కార్పొరేషన్ 140, ఆర్యవైశ్య కార్పొరేషన్ 41, క్షత్రియ కార్పొరేషన్ 6, బ్రాహ్మణ కార్పొరేషన్ 32, కాపు కార్పొరేషన్ ద్వారా 231యూనిట్లు మంజూరైనట్లు అధికారు లు తెలిపారు. 50 శాతం సబ్సిడీతో ఈ రుణాలు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు.



హోరా హోరీగా ఎడ్ల పందేలు

నెల్లూరు రూరల్ మండలం కోడూరుపాడులో శనివారం రాష్ట్రస్థాయి ఎండ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగాసాగాయి. కోడూరు కమలాకర్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ పోటీలను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ప్రారంభించి, మాట్లాడారు. 25 నిమిషాల వ్యవధిలో తెలంగాణలోని సూర్య పేట జిల్లా హుజూర్‌నగర్‌కి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి, సురేంద్రరెడ్డిల ఎడ్లు 2750 అడు గులు 2.25 టన్నుల బరువున్న బండను లాగి తొలివిజేతగా నిలిచాయి. రెండో స్థానంలో కడప జిల్లా మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేష్ యాదవ్ ఎడ్లు, మూడో స్థానంలో గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన తిపన్నరెడ్డి, జస్వితరెడ్డిల ఎడ్లు నిలిచాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా గ్రామంలో ఊళ్లమ్మ అమ్మవారిని ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి దర్శించుకున్నారు.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)

వడ్డే ఓబన్నకు ఘన నివాళి



వడ్డే ఓబన్నకు నివాళులు అర్పిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), జనవరి 11(ఆంధ్ర జ్యోతి): బ్రిటీష్ పాలనకు వ్యతిరే కంగా నిర్వహించిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి వడ్డే ఓబన్న అని జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా సంజామల మండలం నొస్సం గ్రామంలో వడ్డే సుబ్బన్న, సుబ్బమ్మ దంపతులకు వడ్డే ఓబన్న జన్మించారని తెలిపారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరులో ఓబన్న సైన్యాధ్యక్షుడిగా వీరోచిత పోరాటం చేశారని వివరించారు. సంచార తెగల సైన్యాన్ని సమర్థవంతంగా నడిపించి, నల్లమల అడవుల్లో సైతం కుంఫనీ సైన్యాన్ని ఊచకోత కోసి, ఉరుకులు పెట్టించడంలో ఓబన్న ముఖ్య పాత్ర పోషించిన వీరుడన్నారు. వడ్డే ఓబన్న గ్రామ రక్షకుడిగా పనిచేశారని, ఆ సమయంలో రైతులపై అధిక పన్ను లు విధించడంతో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పేద రైతులు, గ్రామస్థుల హక్కులను కాపాడటానికి, సామాన్యుల హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన్ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసు కోవాలని, వారి జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి దాయ కమని ఎస్పీ పేర్కొ న్నారు.

రేపటి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

నెల్లూరు(క్రైం), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భోగి పండుగ సంద ర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలంతా గమనించాలని ఆయన పేర్కొన్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు!

ఆంధ్రజ్యోతి'తో జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి



?: జిల్లాలో ఎన్ని ఎకరాల్లో వరి సాగవుతోంది.

!: జిల్లావ్యాప్తంగా సుమారు 5లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. 90వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుంది. అధికారులు చెప్పిన మోతాదు కంటే అదనంగా వినియోగం ఉంటుంది. ఇప్పటికే దాదాపు 3 లక్షల ఎకరాల్లో వరినాట్లు వేయగా, ఇంకో 2 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

?: యూరియా దిగుమతి. ఎన్ని టన్నులు రైతులకు అందించారు

!: వరి సాగులో యూరియా వివిధ దశల్లో వినియోగిస్తారు. అదేవిధంగా జిల్లాకు కేటాయింపులు ఉంటాయి. జిల్లా అవసరాలకు దాదాపు 90 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుంది. ఇప్పటివరకు దాదాపు 60వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించాము. 17వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉండగా, మరో రెండ్రోజుల్లో ఇంకా వస్తుంది. ఇదీ చాలకుంటే పక్క జిల్లాలకు కేటాయించిన ఎరువులను కూడా మనం వినియోగించుకునేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

?: మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముతున్నారు కదా

!: ప్రభుత్వం నిర్ణయించిన ధరకన్నా ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశాం. రైతుల అవసరాలను అవకాశంగా తీసుకుని అధిక ధరలకు విక్రయాలు సాగిస్తే లైసెన్సులు రద్దు చేస్తాం.

?: అధిక ధరల విక్రయాలపై తీసుకున్న చర్యలు

!: అధిక ధరకు యూరియాను విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకుంటున్నాం. సంగంలో రెండు, పొదలకూరులో మరో రెండు దుకాణాల నిర్వాహకులపై చర్యలు తీసుకున్నాం. యూరియాను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ధరకు రైతులకు విక్రయించాము. వారి వ్యాపార లావాదేవీలను ఆపేశాము కూడా.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

మోపాడు చెరువులో చేపల పెంపకం

మత్స్యశాఖ అధికారుల అత్యుత్సాహం

ఏమీ పట్టనట్టు ఉన్న పంచాయతీ అధికారులు

బహిరంగ వేలం నిర్వహణలో మీనమేషాలు

ఉత్తర్వులన్నీ బేఖాతర్!

కందుకూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సాక్షాత్తూ రాష్ట్ర హైకోర్టు వెలువరించిన తీర్పును, కలెక్టరు జారీచేసిన ఉత్తర్వులను బేఖాతర్ చేస్తూ డివిజన్‌స్థాయి అధికారులు అడుగులు వేస్తున్నారు. కందుకూరు మండలంలో అత్తాకోడళ్ల చెరువులుగా ప్రసిద్ధి చెందిన మాచవరం, మోపాడు చెరువులలో ఒకటైన మోపాడు చెరువులో చేపల పెంపకం వ్యవహారం కొన్నేళ్లుగా రెండు పంచా యతీల మధ్య వివాదం ఏర్పడగా ఈ సమస్య పరిష్కారానికి హైకోర్టు స్పష్టమైన మార్గనిర్దేశాలు ఇచ్చింది. మోపాడు చెరువు మోపాడు, కొండముడు సుపాలెం రెవెన్యూల పరిధిలో విస్తరించి ఉండగా అందులో అధిక భూభాగం కొండముడుసు పాలెం రెవెన్యూ పరిధిలోనే ఉంది. అయితే పేరుకు మోపాడు చెరువు కనుక అందులో వస్తున్న చేపల ఆదాయాన్ని కొన్ని దశాబ్దాలుగా మోపాడు పంచాయతీకే దక్కుతుండటాన్ని సవాల్ చేస్తూ కొండముడు సుపాలెం సర్పంచ్ తుమ్మా కోటేశ్వరమ్మ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో 2022 జూన్ 20న చెరువు విస్తీర్ణం ఏ రెవెన్యూ పరిధిలో ఎంత ఉంది, చెరువు ఆయకట్టు ఏ గ్రామంలో ఎంత ఉందో పరిశీలించి తదనుగుణంగా చేపల ఆదాయాన్ని రెండు పంచాయతీలకు పంచాలని ఉత్తర్వులు జారీచేసింది. ఆ మేరకు అప్పటి కలెక్టరు చక్రధర్‌బాబు పలు దఫాలు రెండు పంచాయతీల సర్పంచ్‌లు, గ్రామస్థులతో సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలు తీసుకున్నారు. అంతేగాక ఫిబ్రవరి 7న రెండు గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి ప్రజాభిప్రాయం కూడా సేకరించారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి, ఇరిగేషన్ ఎస్‌ఈ, ఫిషరీస్ జేడీలతో ఓ కమిటీని ఏర్పాటుచేసి వారి నివేదిక ఆధారంగా రెండు పంచాయతీల మధ్య చేపల ఆదాయం హక్కును విభజిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2023 మేలో చేపల ఆదాయంలో కొండముడు సుపాలెంకు 61 శాతం, మోపాడు పంచాయతీకి 39 శాతం చెందుతుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ మేరకు ఫిషరీస్ జేడీ ఖాతాలో ఉన్న చేపల నిధులను పంచాయతీలకు పంచాలని కూడా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే కింది స్థాయి అధికారులు వాటన్నిటినీ పక్కనపెట్టి పాత పద్ధతిలోనే చేపల ఆదాయం మోపాడుకే దక్కేలా చేపల పెంపకం చేపట్టేందుకు సన్నాహాలు ప్రారంభించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. చేపల వేలం పెట్టుకుని నిధులు జమచేసుకునే హక్కును మోపాడుకు కట్టబెడు తూ కావలి ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి డిసెంబరు 26న మోపాడు నుంచి మత్స్యశా ఖకు ఫీజును కట్టించుకున్నారు. రూ.2.29 లక్షలు మోపాడు పంచాయతీ నుంచి జమ చేసుకుని వారికి హక్కులు కల్పించటం విశేషం.



మోపాడు చెరువు ఇదే!

● నాలుగేళ్లుగా మూలుగుతున్న నిధులు

కాగా చేపల పెంపకం ఆదాయంపై రెండు పంచాయతీల మధ్య వివాదం నెలకొన్న నేపథ్యంలో నాలుగేళ్లక్రితం చేపల వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని అప్పట్లో కలెక్టరు సీజ్ చేసి మత్స్యశాఖ జేడీ ఖాతాలో జమ చేయించారు. 2021లో ఈ చెరువు చేపల బహిరంగ వేలం నిర్వహించగా రూ.22 లక్షలకు పాట పాడుకున్నారు. ఆ మొత్తం మోపాడు పంచాయతీకి జమ చేయడాన్ని సవాల్‌చేస్తూ కొండముడుసుపాలెం పంచాయతీ కోర్టును ఆశ్రయించటంతో నిధులను కలెక్టరు సీజ్ చేయించారు. అనంతర పరిణామాలలో హక్కుల విభజన జరిగినా ఆ నిధుల పంపిణీ నేటికీ జరగలేదు. ఆ వ్యవహారం అలా ఉండగానే ఈ ఏడాది చేపల పెంపకం హక్కును విభజన ఉత్తర్వులకు అనుగుణంగా రెండు పంచాయతీలకు చెందేలా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఏకపక్షంగా వ్యవహరించటంలో ఆంతర్యం ఏమిటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అంతేగాక చేపలు బహిరంగ వేలం పెట్టకుండా కాలయాపన చేస్తుండటం కూడా అనుమానాలకు తావిస్తోంది. కలెక్టరు ఉత్తర్వులను అనుగుణంగా మత్స్యశాఖ, డివిజనల్ పంచాయతీ అధికారులు రెండు గ్రామ పంచాయతీల నేతృత్వంలో చేపల వేలం నిర్వహించి ఎవరి హక్కుమేరకు వారికి నిధులు జమ చేయటంతోపాటు పాత నిధుల పంపిణీ కూడా పూర్తిచేయాలని కోరుకుంటున్నారు.

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ







ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత





కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మీ (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- గత వైసీపీ పాలనలో బిందుసేద్యం రాయితీకి రాంరాం...
- కూటమి ప్రభుత్వం మంజూరుకు చర్యలు
- అర్హులనుంచి దరఖాస్తుల ఆహ్వానం



గట్టుపల్లి చింతలపాలెంలో బిందుసేద్యంతో సాగవుతున్న వంగతోట

జలదంకి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బోర్లు, బావుల పంటలు సాగుచేస్తున్న మెట్టపంటల రైతులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్ట్ (ఎపిఎంఐపి) ద్వారా రాయితీతో చిన్న, సన్నకారు రైతులకు బిందు సేద్యం పరికరాలు పంపిణీ చేయగా కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని తిరిగి ప్రారంభిస్తూ రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. రాయితీ ఎపుడు ఇస్తారా అని ఎదురుచూస్తున్న మెట్ట ప్రాంతాల అన్నదాతలు రైతుసేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటున్నారు.

● బహుళ ప్రయోజనాలివే:

వ్యవసాయబోర్లు, బావుల కింద కూరగాయలు, పండ్లతోటలు సాగుచేసేవారు సూక్ష్మ సేద్యంతో పంటల సాగులో నీటివృథాను నూరుశాతం అరికట్టడంతో పాటు అధిక విస్తీర్ణంలో సాగుచేయవచ్చు. సాగుచేసిన మొక్కలు, పైరు ఏపుగా ఎదిగి అధిక దిగుబడులు వస్తాయి. తుంపర్ల (స్ప్రింక్లర్ల ద్వారా పంటకు సాగునీరు పెడితే గాలిలో నీరు నత్రజనిని తీసుకుని పైరుపై నీరు చల్లినట్లు పడడంతో పైరు బాగా పెరుగుతుంది. అదే ఈ పంటలకు నేరుగా నీటితడులు ఇస్తే నీటివృథాతో పాటు సాళ్ల మధ్యలో కలుపు మొక్కలు మొలచి పైరు ఎదుగుదలను నిలువరిస్తుంది. ఈ బాధలను డ్రిప్ సాగుతో తప్పించవచ్చు. అంతేకాక రసాయనిక ఎరువులు డ్రిప్ ద్వారా నేరుగా నీళ్లతో కలసి మొక్కకు అందించవచ్చని అధికారులు చెబుతున్నారు.

● రాయితీ ఇలా పొందొచ్చు:

ప్రభుత్వ రాయితీ పొందాలంటే రైతులు పొలం పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, వ్యక్తిగత బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్సు కాపీలు తీసుకుని స్థానిక రైతుసేవా కేంద్రాలకు వెళ్లి ఏవీఏంలను సంప్రదించాలి. లేదా కామన్ సర్వీస్ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యవసాయభూమిలో బోరు లేదా బావి నిర్మించి ఉంటే ఈ పథకం కింద అర్హులవుతారు.

● రాయితీ వివరాలిలా ఉన్నాయి:

బిందు (డ్రిప్)సేద్యంకు 5ఎకరాలలోపు రైతులకు 90శాతం రాయితీతో రూ.2.18లక్షల సూక్ష్మ సేద్య పరికరాలందుతాయి. 10ఎకరాలలోపు రైతులకు 70శాతం రాయితీతో రూ.3.46లక్షల పరికరాలు పొందుతారు. అదే తుంపర్ల (స్ప్రింక్లర్ల) సేద్యంకు 5ఎకరాలలోపు పొలం ఉన్న రైతులకు 55 శాతం రాయితీ పొందవచ్చు. 10ఎకరాలలోపు ఉన్న రైతులు 45శాతం రాయితీ పొందడంతో పాటు పరికరాలు ఎంచుకునే వీలుంది.

రోగులకు మెరుగైన వైద్యసేవలు

● డాక్టర్ కేవీ శేషారత్నం



ఇంటర్వ్యూ...

ఆత్మకూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద శా లలో కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. వైద్యశాల అభి వృద్ధిపై రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టి సారించి మరిన్ని వసతుల కల్పనకు కృషి చేస్తున్నారని సూపరిం టెండెంట్ కెవి శేషారత్నం తెలిపారు.

? అభివృద్ధికి చర్యలేవి.

! త్వరలో ఎమ్మారై, సిటీ స్కానింగ్ మిషన్‌లు అందుబాటులోకి తెస్తాం. అందుకు అవసరమైన గదిని సిద్ధం చేసి ఉంచాం. బ్లడ్‌బ్యాంకు ఏర్పాటుకు లైసెన్సు వచ్చింది.

? వైద్యశాలలో ఎన్ని విభాగాలు ఉన్నాయి.

! ఆసుపత్రిలో 13 విభాగాలున్నాయి. ప్రస్తుతం 100పడకలు మాత్రమే ఉన్నాయి. 200పడకలు ఏర్పాటుకు కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి ఆనం వెల్లడించడం హర్షదాయకం.

? సిబ్బంది కొరత ఉందా.

! వైద్యశాలలో 8 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గైనకాలజీ విభాగంలో ముగ్గురు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం.

? వైద్యశాలలో మందుల కొరత పరిస్థితి ఏమిటి.

! వైద్యశాలలో మందుల కొరత లేదు. హెచ్‌ఎంపీవీ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉన్నాం. మాస్కులు, శానిటైజర్లు, గ్లూకోమీటర్లు, పల్స్ ఆక్సీమీటర్లు, ఆక్సిజన్ పైపులైను, సిలిండర్లు, యాంటివైరల్‌కు సంబంధించిన మందులన్నీ అందుబాటులో ఉన్నాయి.

ఆర్థిక సాయం

దుత్తలూరు(ఉదయగిరి), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నర్రవాడ బీసీ కాలనీ సవరం వెంగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో దాతలు అందజేసిన రూ.30 వేల నగదును ఎస్‌ఐ ఆదిలక్ష్మి శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. జిల్లా కిసాన్ మోర్చా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు మేకపాటి శ్రీనివాసులకు వివరించడంతో స్పందించిన ఆయన నగదును ఇచ్చారు.కార్యక్రమంలో తెడ్డుపాడు సర్పంచ్ బోయపాటి వెంకటరత్నం, మండల తెలుగు యువత తులసీరామ్ ఉన్నారు.

మద్యం దుకాణం ప్రారంభం

ఉదయగిరి రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గండిపాళెంలో కొనసాగిన వర్గ విభేదాలకు శనివారం తెరపడింది. ఉదయగిరిలోని దుకాణాన్ని గ్రామానికి తరలించి ప్రారంభించారు. విషయం తెలుసుకొన్న మందుబాబులు మద్యం కొనుగోలు చేసేందుకు బారులు తీరడంతో సందడి నెలకొంది.

పేకాట స్థావరంపై దాడి

కందుకూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పలుకూరు సమీప పొలాల్లో నడుస్తున్న పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. అనంతరం వారి వద్ద రూ.19,400ల నగదు, ఆరు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

● ఉదయగిరి: దుర్గం అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న జూదస్థావరంపై సీఐ ఎన్ వెంకటరావు, ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డిలు సిబ్బందితో దాడులు నిర్వహించారు. నలుగురు జూదరులు, రూ.4వేలను స్వాధీనం చేసుకోగా, మరో నలుగురు పరారైనట్లు తెలిపారు. వారిని కూడా అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరుచనున్నట్లు తెలిపారు.

నేతలకు శాశ్వత సభ్యత్వం

కొండాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మాజీ కన్వీనర్ బొట్లగుంట హరిబాబు, మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరావులు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఎమ్మెల్యే ఈ సందర్భంగా వారిని అభినందించారు.

మతోన్మాదం ప్రమాదకరం

కావలి టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మతోన్మాదంతో దేశానికి ప్రమాదమని సీ పీ ఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి తెలిపారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పట్టణ కమిటీ కార్యదర్శి పసుపులేటి పెంచులయ్య అధ్యక్షతన మతోన్మాద ప్రమాదంపై చేపట్టిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. మాల్యాద్రి, రా వి మాల్యాద్రి, తుమ్మల వెంకయ్య, నరహరి పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌కేలతో కొనుగోలు

ఉదయగిరి: రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరతో రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. శనివారం కృష్ణారెడ్డిపల్లి, బిజ్జంపల్లి, లింగంనేనిపల్లిలోని కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించి రైతులతో చర్చించారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే ఇంటూరి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు జనవరి 11 (ఆంధ్రజ్యోతి):నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని 2వ వార్డు ఉర్దూ స్కూల్ నుంచి ఉప్పుచెరువు రోడ్డు వరకు రూ.19.5లక్షల అంచనావ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం సమ్మర్‌స్టోరేజి ట్యాంకు సమీపంలోని స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.అనూష, నేతలు దామా మల్లేశ్వరరావు, షేక్ నాగూర్, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, ఉన్నం వీరాస్వామి, కూనం నరేంద్ర, ముచ్చు శ్రీనివాసరావు, గడ్డం మాలకొండయ్య, పువ్వాడి కోటయ్య, చుండూరి శ్రీను, సవిడిబోయిన వెంకటకృష్ణ పాల్గొన్నారు.

● ఉలవపాడు: యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పారిశ్రామిక హబ్‌గా నియోజకవర్గం మారబోతుందని ఎమ్మెల్యే ఇంటూరి అన్నారు. చాకిచర్లలో పలమాల వెంకటేశ్వర్లు రూ.2.30లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన పశువుల షెడ్డును ప్రారంభించారు. పాదయాత్ర సమయంలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 27పశువుల షెడ్ల నిర్మాణానికి పాడి రైతులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించి సమస్యలపై ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. కార్యక్రమంలో కం దుకూరు ఏపీడీ బాబురావు, ఉలవపాడు పశుసంవర్ధక శాఖ ఏడీ సురేష్‌నాయుడు, ఏపీవో వెంకటేశ్వర్లు, పశువైద్యరాలు నజ్మా ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కావ్య

కావలి రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే గౌరారంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లోసుమారు రూ.60లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అలాగే 79 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను ప్రారంభించారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని గ్రామస్థులు ఇచ్చిన వినతులు స్వీకరించారు. చిప్పలేరు, పిల్లివాగు కాలువల ఆధునీకరణ పనులు చేపడతామన్నారు. గౌరవరంను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరపల్లి రాధిక, ఎమ్పీడీవో శ్రీదేవి, విద్యుత్‌శాఖ డీఈఈ రవికుమార్, ఈఈ బెనర్జీ, పంచాయతీరాజ్ ఈఈ వేణుగోపాల్, డీఈఈ శ్రీనివాసరావు, తహసీల్దారు శ్రావణ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, ఉప్పాల వెంకట్రావ్, నేతలు చింతం బాబుల్‌రెడ్డి, సూరె శ్రీనివాసులు రెడ్డి, జయశ్రీ పాల్గొన్నారు.

● క్యాలెండర్ ఆవిష్కరణ

కావలి: దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి ఆధ్వర్యంలో శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీధర్ చేతులమీదుగా అంబేద్కర్ క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. ఈ సందరంగా డీఎస్పీ మాట్లాడారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకవెళ్లాలన్నారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి, న్యాయవాది యల్లంటి వెంటేశ్వర్లు, రెండో పట్టణ సీఐ గిరిబాబు, సర్కిల్ సీఐ పాపారావు, దళితసంఘాల నేతలు సుకుమార్, ప్రసన్న కుమార్,బాపట్ల సత్యవతమ్మ, లక్ష్మయ్య పాల్గొన్నారు.



సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి

పట్టణాభివృద్ధికి కలిసి రావాలి

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



మినీగోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు,జనవరి11(ఆంధ్రజ్యోతి): పట్టణ అభివృద్ధికి అందరూ కలిసి రావాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శనివారం పట్టణ నడుమూరులో యల్లాల మోహన్‌రెడ్డి నిర్మించిన గోకులాన్ని ఎమ్మెల్యే కాకర్ల ప్రారం భించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రఘునాధరెడ్డి, జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర యాదవ్, మాజీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సొసైటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సుల ఏర్పాటు

ఉదయగిరి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని దూర ప్రాంత ప్రయాణికుల సౌకర్యార్థం ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి సాధారణ సర్వీసులతో పాటు అదనంగా ఎనిమిది ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఉదయగిరి-హైదరాబాదు-4, ఉదయగిరి- బెంగళూరు-3, చెన్నై-1 సర్వీసు చొప్పున నడుపుతున్నామన్నారు. సాధారణ చార్జీలు వసూలు చేయడం జరుగుతుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి ఆనం రామానారాయణరెడ్డి
- జమ్మవరంలో పశువుల కొట్టాలు, సిమెంటు రోడ్ల ప్రారంభం



పశువుల షెడ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం రామానారాయణరెడ్డి

ఏఎస్ పేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తోందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామానారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆయన జమ్మవరంలో ప్రభుత్వ సహకారంతో నిర్మించిన పశువుల కొట్టాలను, నూతనంగా నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మవరం గ్రామంలోని రామలయం అభివృద్ధికి రూ. 80లక్షలు, కాకర్లపాడు గ్రామంలోని మాతమ్మ దేవాలయం అభివృద్ధికి రూ. 15లక్షలు మంజూరు చేశామని తెలిపారు. ప్రతి గ్రామంలో జలజీవన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు, సిమెంటు రోడ్లు, కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రైతులు, విద్యార్థులు, వృద్ధులు అన్నివర్గాల ప్రజల అభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీరామకృష్ణ, ఎంపీడీవో ప్రసన్నకుమారి, సీనియర్ నాయకులు తాళ్లూరు గిరినాయుడు, ఆనం కైవల్యరెడ్డి, అబూరి రమేష్‌నాయుడు, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, కాటంరెడ్డి నరసింహరెడ్డి, గ్రామ సర్పంచ్ దొరసానమ్మ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీద రవిచంద్ర జన్మదిన వేడుకలు

అల్లూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర 53వ జన్మదిన వేడుకలను శనివారం అల్లూరులో పార్టీ నాయకులు, కార్యకర్తలు వైభవంగా నిర్వహించారు. పెన్నార్ డెల్టా కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ నేతృత్వంలో స్థానిక నాయకులు స్థానిక కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. పేదలకు దుప్పట్లు పంపిణీ, అన్నదానం చేపట్టారు. 55 మంది యువకులు రక్తదానం చేశారు. బీద రవిచంద్ర మరెన్నో పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, బుల్లా కృష్ణారెడ్డి, మేడా కృష్ణారెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి చైతన్యరెడ్డి, ఎండోటి హరికృష్ణ, తోట శ్రీహరి, అంబటి రాజేంద్ర, కప్పిరి విష్ణు, గుంజి రుద్రయ్య, ఊటు శ్రీకాంత్, దువ్వూరు శేఖర్‌రెడ్డి, యరటపల్లి శేఖర్‌రెడ్డి, పీజీఎం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

● బిట్రగుంట: బోగోలు టీడీపీ పార్టీ కార్యాలయంలో బీదరవిచంద్ర జన్మదిన వేడు కలు జరిగాయి. టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కోడూరు వెంకటశ్వరరెడ్డి, ఎల్.సుధీర్‌బాబు, యర్రం వెంకటేశ్వర్లురెడ్డి, మాధవరావు, చిన్నగోవిందు, విజయకు మార్ యాదవ్, ఏ.ఆదిశేషయ్య, పీ.సుబ్బా రావు ఉన్నారు.



వేడుకలో పాల్గొన్న మాలేపాటి నాగేశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డి



రక్తదానంలో పాల్గొన్న బీద గిరిధర్, అభిమానులు

కలిగిరి విద్యార్థినికి బంగారు పతకాలు

కలిగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో జరిగిన సౌత్ ఇంటర్నేషనల్ ఫ్రీ స్టైల్ రిలే టోర్నమెంట్‌లో కలిగిరి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని వనిపెంట శ్రావణి ప్రతిభ చూపి బంగారు పతకాన్ని సాధించినట్లు హెచ్‌ఎం భీమేశ్వరరావు శనివారం తెలిపారు. జిల్లా జంప్‌రోప్ సెక్రటరీ జీ.మురళి ఆధ్వర్యంలో తర్ఫీదు పొందిన శ్రావణి ఈ పోటీల్లో కూడా రెండు బంగారు పతకాలు సాధించడం హర్షణీయం అన్నారు. సౌత్ ఇంటర్నేషనల్‌లో సెలక్ట్ జపాన్‌లో జరిగే ప్రపంచకప్ పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఈ సందర్భంగా శ్రావణిని రాష్ట్ర జంప్‌రోప్ అధికారులతో పాటు, జిల్లా అధికారులు ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు.



బంగారు పతకాలతో శ్రావణి

చండీయాగం పోస్టర్ల ఆవిష్కరణ

కావలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆర్వీపాలెం విజయదుర్గ ఆస్థాన పీఠంలో ఫిబ్రవరి 12న మహాచండీ యాగం నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు పత్రి వీరబ్రహ్మయ్య స్వామి తెలిపారు. శనివారం యాగంకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపచేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, మల్లికార్జున పాల్గొన్నారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు



కావలి: బహుమతులు అందజేస్తున్న స్వర్ణలత

కావలి టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక 20వ వార్డులోని సచివాలయ వీధిలో శనివారం మీ కోసం స్వచ్ఛంద సంస్థ సభ్యులు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు రాయపాటి దిలీప్ పర్యవేక్షణలో జరిగిన మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారుల ఆటపాటలు నిర్వహించడంతో సందడి వాతావరణం నెలకొంది. ముఖ్యఅతిథులుగా సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ స్వర్ణలత, విశ్రాంత ఉప తహసీల్దారు మొగల్ సిరాజ్‌బేగ్‌లు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మారుతీరావు, రవికుమార్ పాల్గొన్నారు.

● కందుకూరు: ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బందికి కరస్పాండెంట్ కంచర్ల రామయ్య కుటుంబసభ్యులతో కలిసి నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల టెక్నికల్ డైరెక్టర్ కె. విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, ఆర్‌అండ్ డీన్ లక్ష్మణరావు, వైస్ ప్రిన్సిపాల్ హరిబాబు పాల్గొన్నారు.

● కుల్లూరులో

● కలువాయి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కుల్లూరులో మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతుల ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలో పాల్గొన్న మహిళలందరికీ బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

రేపు ముగ్గుల పోటీలు

ఆత్మకూరు: శ్రీకృష్ణ సేవాసమితి, యాదవ ఎంప్లాయిస్ సొసైటీ సౌజన్యంతో సోమవారం మధ్యాహ్నం 3గంటలకు పట్టణంలోని శ్రీకృష్ణ మందిరం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించనునట్లు నిర్వాహకులు శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతిగా స్మార్ట్ టీవీ, ద్వితీయ బహుమతి మిక్సీ, తృతీయ బహుమతిగా రైస్‌కు క్కర్ అందజేయడంతో పాటు పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతులు అంజేస్తామన్నారు. ఆసక్తిగల మహిళలు 9573105305, 9704109344 నెంబర్లకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.



కందుకూరు: దుస్తులు అందజేస్తున్న కంచర్ల రామయ్య



కలువాయి: ముగ్గులను పరిశీలిస్తున్న మాదాసు దంపతులు

న్యూస్ బాక్స్

ప్రమాదాలపై అవగాహన

సంగం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారి కూడలిలో యువకులకు రోడ్డు ప్రమాదాల నివారణపై ఎస్ఐ రాజేష్ శనివారం అవగాహన కల్పించారు. ముంబయి జాతీయ రహదారిపై హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న యువకులను ఆపి అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు.

వాలీబాల్ పోటీల ప్రారంభం

కలువాయి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. కలువాయి, అనంతసాగరం, చేజర్ల, రాపూరు మండలాల పరిధిలో పోటీలు నిర్వహిస్తున్నారు. పండుగ రోజు ఫైనల్స్ పోటీలు ఉంటాయిన నిర్వాహకులు తెలిపారు.

చోరీ కేసు నమోదు

ఉలవపాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదురు బజారులోని తన ఇంటిలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు బాధితులు ఏకొల్లు ఉమామహేశ్వరి శనివారం ఫిర్యాదు చేసిందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు.

క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి



పోటీలను ప్రారంభిస్తున్న పెంచలరావు

ఆత్మకూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు ఓటములతో సంబంధం లేకుండా యువత క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు తెలిపారు. ఆత్మకూరు మండలం కరటంపాడు పంచాయతీ సాతానుపల్లిలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది నందా ఓబులేశు, సోమశిల ఉత్తర వాలువ వైస్‌చైర్మన్ పూనుగుంట ధనుంజయ, జ్యోతి గిరి పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో సరుడు మాయం

మర్రిపాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న వృద్ధురాలి మెడలోని సరుడు మాయమైన ఘటన శనివారం డీసీపల్లిలో వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. వింజమూరు మండలం శంఖవరం వెకటసుబ్బమ్మ అనే వృద్ధురాలు వైద్యం కోసం నెల్లూరు వెళ్లి తిరిగి ఇంటికి వస్తూ చైన్నై బస్సు ఎక్కింది. ఆమె బస్సు దిగవలసిన స్టేజీ డీసీపల్లి వద్ద మెడలోని సరుడును చూసుకోగా లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కులగణనతోనే న్యాయం

కందుకూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కులగణనతోనే సామాజిక న్యాయం సాధ్యమని, తక్షణమే రాష్ట్రంలో కులగణన చేపట్టాలని బీసీ ఐక్యవేదిక నాయకులు కొండా వెంకటశివయ్య, కళ్లగుంట మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన బీసీ ఐక్యవేదిక సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సర్వే చేపడితే అత్యధిక జనాభా ఉన్న బీసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఫిబ్రవరి 8న బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో కందుకూరులో కులగణనపై సదస్సు నిర్వహించాలని ఈ సందర్భంగా తీర్మానించారు. సమావేశంలో వివిధ బీసీ సంఘాల నాయకులు కొండా వెంకటశివయ్య, కళ్లగుంట మోహనరావు, షేక్ అబ్దుల్లా, షేక్ మధు, వెంకటేశ్వర్లు, కొండయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

ఉదయగిరి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్‌లో ముత్యాలపాటి ఖాదర్ సాహెబ్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం నిర్వాహకులు ముత్యాలపాటి హనీఫ్ ప్రారంభించారు. ఈ పోటీల్లో విజేతలైన వారికి మొదటి బహుమతిగా రూ.30వేలు, రెండవ బహుమతిగా రూ.20వేల నగదుతోపాటు మెమెంటోలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖాజామొహిద్దీన్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.